

కోటప్పకొండపై.. తొలి ఏకాదశి సందడి

కోటప్పకొండ (నరసరావుపేట), జూలై 17 : తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర సన్నిధిలో బుధవారం భక్తుల కోలాహలం నెలకొంది. స్వామికి పంచామృతాలు, విశేష ద్రవ్యాలతో రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు కొండకు వేలాదిగా తరలి వచ్చి కోటయ్య స్వామిని దర్శించుకొని ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు పొంగళ్ళు చేసి స్వామికి సమర్పించారు. ఆనందవల్లి అమ్మ వారిని దర్శించుకుని పూజలు చేశారు. సోపాన మార్గంలో భక్తులు మెట్ల పూజలు చేశారు. వినాయక స్వామి విగ్రహం, ధ్యాన శివుని విగ్రహం, నాగేంద్రుని పుట్ట వద్ద భక్తులు పూజలు చేశారు. ఎమ్మెల్యేలు డాక్టర్ అరవింద బాబు, ప్రత్తిపాటి పుల్లారావు శ్రీ త్రికోటేశ్వర స్వామిని దర్శించుకొని పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఏసీ ఎన్ శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసింది. వివిధ సేవా సంస్థలు ప్రసాదం పంపిణీ చేశాయి.

శ్రీ త్రికోటేశ్వర స్వామికి నాగాభరణం

శ్రీ త్రికోటేశ్వర స్వామికి భక్తులు వెండికి బంగారం పోత పోసిన నాగాభరణం సమర్పించారు. రూ 6 లక్షల విలువైన నాగాభరణాన్ని పెదనందిపాడు మండలం రావిపాడు గ్రామానికి చెందిన మహంకాళి నాగరాజు, లక్ష్మీ, మహంకాళి శ్రీకాంత్, లక్ష్మీ స్వామికి కానుకగా ఇచ్చారు.

ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జామ్

ట్రాఫిక్ క్రమబద్ధీకరించడంలో పోలీసులు విఫలమయ్యారు. ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించి గంటన్నర పాటు ట్రాఫిక్ నిలిచిపోవడంతో భక్తులు ఇక్కట్లు పడ్డారు. ఎమ్మెల్యే పుల్లారావు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు.



జలాభిషేకం



పసుపుతో..



కుంకుమతో..



గంధంతో..



విభూదితో..



ప్రత్యేక అలంకారం

ప్రభుత్వ భూమి.. ప్రభుత్వానికే.. దానం!

దానికి సీఎంతో సన్మానం

నిరుపేదలకు అసైన్డ్ చేసిన ప్రభుత్వ భూమిని చట్ట ప్రకారం కొనడం, అమ్మడం నేరం.. అంటే చట్టప్రకారం ఆ భూమిపై సర్వహక్కులు ప్రభుత్వానివే.. అలాంటిది బాపట్ల మెడికల్ కళాశాలకు కేటాయించిన స్థలంలో ఓ రేంజ్ జగన్నాటకానికి గతంలో వైసీపీ ప్రభుత్వం తెరలేపింది. అసైన్డ్ భూమి అంటేనే అది సాంకేతికంగా ప్రభుత్వ భూమి కింద లెక్క..అలాంటిది దానిని ఓ వ్యక్తి ఉదార వైఖరితో బాపట్ల మెడికల్ కళాశాల నిర్మాణం కోసం దానం ఇచ్చారట.. అది నచ్చి ఏకంగా అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి చేత సదరు వ్యక్తికి సన్మానం కూడా చేయించారు.. ఈ తంతు అంతటిని అప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లా అధికారులు చోద్యం చూశారు. ఇది బాపట్ల మెడికల్ కళాశాల స్థలం విషయంలో వైసీపీ ప్రభుత్వంలో చోటు చేసుకున్న వింతవైఖరి. అన్నింటికన్నా మించి పరాకాష్ట ఏమిటంటే అప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్ మెడికల్ కళాశాల నిర్మాణం కోసం ఆ భూమిలో పేదలెవరు లేని కారణంగా దానిని తిరిగి తీసుకుంటున్నట్లు ఉత్తర్వులు కూడా ఇచ్చారు. మరి ఇక్కడ వితరణకు అవకాశం ఎక్కడ ఉందనే దానికి అప్పటి ప్రభుత్వమే సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఈ మొత్తం ప్రక్రియ వెనకాల మెడికల్ కళాశాల చుట్టూ ఉన్న అసైన్డ్ భూముల ధర పెంచే కుట్ర జరిగిందనే అనుమానాలు అప్పట్లోనే వ్యక్తమయ్యాయి.



- అసైన్డ్ భూమికి కొత్త భాష్యం చెప్పిన వైసీపీ
- బాపట్ల మెడికల్ కళాశాల భూ వ్యవహారంపై అనుమానాలు
- మొత్తం వ్యవహారంలో క్విడ్ ప్రో కోపై సందేహాలు
- సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్లు

బాపట్ల, జూలై 17 (ఆంధ్రజ్యోతి): బాపట్లలోని మెడికల్ కళాశాల నిర్మాణం కోసం పట్టణ శివారులోని జమ్ములపాలెం రోడ్డులో 54 ఎకరాల భూమిని అప్పటి వైసీపీ ప్రభుత్వం గుర్తించి 2021 మేలో భూమిపూజ చేపట్టింది. ఈ 54 ఎకరాలతో పాటు దీని చుట్టూ ఉన్న మరో 125 ఎకరాల వరకు అసైన్డ్ భూమిగానే ప్రభుత్వ రికార్డులు ధ్రువీకరిస్తున్నాయి. కానీ కళాశాల నిర్మాణం కోసం భూమిని దాత విరాళంగా ఇచ్చారని అప్పట్లో వైసీపీ నేతలు ప్రకటించారు. మరోవైపు ఈ భూమి అసైన్డ్ అని పేదలెవరూ లేని కారణం చేత తిరిగి ప్రభుత్వం తీసుకుని కళాశాల నిర్మాణం కోసం వినియోగిస్తున్నట్లు అప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వం ఓ రకమైన ఆదేశాలిస్తే, వైసీపీ నేతలు మాత్రం ఆ భూమిని ఓ వ్యక్తి వితరణగా ఇచ్చారని ప్రచారం చేశారు.

సన్మానం చేయడం ఏమిటి..

వైసీపీ ప్రభుత్వంలో అసైన్డ్ భూముల చట్టవిరుద్ధ క్రయవిక్రయాలకు ఏ విధంగా మద్దతు పలికారు అనేదానికి బాపట్ల మెడికల్ కళాశాల భూమి అంశాన్ని నిదర్శనంగా చెప్పవచ్చు. అసైన్డ్ భూములను కొనడమే నేరమని చట్టం చెబుతుంటే ఆ భూములను కొనుగోలు చేసి సుదీర్ఘకాలం అనుభవించిన వ్యక్తి వితరణ ఇచ్చాడని చెప్పి ఏకంగా అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డే సన్మానం చేయడం, దానికి సాక్షీభూతాలుగా ప్రభుత్వ అధికారులు నిలవడం ఏమిటనేది అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది. కొత్తప్రభుత్వం కొలువుదీరగానే ఐదేళ్లలో జరిగిన భూ అక్రమాలపైనే ప్రధానంగా దృష్టిపెట్టింది. ముఖ్యంగా అసైన్డ్ బాగోతాలపై సమగ్ర విచారణ చేపట్టి పేదలకు న్యాయం చేయాలనే ఆలోచన కూడా కొత్త ప్రభుత్వం చేస్తోంది. ఈ నేపథ్యంలో బాపట్లలో జరిగిన మెడికల్ కళాశాల అసైన్డ్ భూమి వ్యవహారంలో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే చేసిన హడావిడి మరోమారు చర్చకు వచ్చింది. అసైన్డ్ భూమిని వితరణగా ఇచ్చారని చెప్పి ఏకంగా ప్రభుత్వాధినేత చేతే సన్మానం చేయించే బరితెగింపునకు అప్పటి వైసీపీ నేతలు పాల్పడ్డారంటే చట్టాలపై వీరి లెక్కలేని తనానికి ఈ ఉదంతం ఓ ఉదాహరణగా చెప్పవచ్చు.

తొలుత పరిహారం పేరుతో కుట్ర...

మెడికల్ కళాశాలకు భూ సేకరణ అంశం అప్పట్లో తెర మీదకు వచ్చినప్పుడు తొలుత అసైన్డ్ భూముల్లో పేదలే ఉన్నట్లు చూపి పరిహారం సాకుతో కోట్లు దోచేయాలని వైసీపీ నేతలు పథకం వేశారు. కానీ ఆ భూమి మొత్తం అసైన్డ్ చేసిందేనని, అక్కడ పేదలెవరూ సాగుచేయడం లేదనే అంశం బయటకు పొక్కడంతో వితరణ నాటకానికి వైసీపీ నేతలు ముగింపు పలికారు. భూముల ధర పెంపుకోసం క్విడ్ ప్రోకో ప్రాతిపదికనే ఈ తతంగం అంతా జరిగినట్లు సమాచారం.

విచారణ చేయించాల్సిందే..

మెడికల్ కళాశాల చుట్టూ ఉన్న మరో 125 ఎకరాల భూమి కూడా పేదలకు అసైన్డ్ చేసినదే. ఇటీవల ప్రభుత్వం అసైన్డ్ చేసిన పేదలకు యాజమాన్య హక్కులు కల్పించే క్రమంలో బాపట్ల పరిధిలో ఉన్న దాదాపు 2300 ఎకరాలకు సంబంధించి ఒక్కరంటే ఒక్కరు కూడా ఒరిజినల్ అసైనీ సదరు భూమిని అనుభవించడం లేదని తేల్చేసి ఎవరికీ యాజమాన్య హక్కులు కల్పించలేదు. మెడికల్ కళాశాల చుట్టూ ఉన్న భూముల విషయంలో ఇదే నివేదికను గతంలో అధికారులు ఇచ్చారు. కానీ మెడికల్ కళాశాల చుట్టూ ఉన్న భూములు పేదల నుంచి వైసీపీ నేతల చేతిలోకి మారినట్లు సమాచారం. వాటికి ధర పెంచి రియల్ సొమ్ము చేసుకునే క్రమంలోనే ఈ వితరణ నాటకానికి తెరలేపి క్విడ్ ప్రో కో కుట్ర పన్నినట్లు తెలుస్తోంది. మెడికల్ కళాశాల సమీపంలో ఉన్న అసైన్డ్ భూములలో ఒరిజినల్ అసైనీ లేరని ఇప్పటికే గత ప్రభుత్వం ధ్రువీకరించింది. అలాంటప్పుడు ఆ భూములను కూడా తిరిగి స్వాధీన పరచుకునే విధంగా కొత్త ప్రభుత్వం అడుగులు వేయాల్సి ఉంది. అప్పుడే గత ప్రభుత్వంలో వ్యూహం ప్రకారం అసైన్డ్ భూమి దానం అనే నాటకానికి తెరలేపిన వైసీపీ నేతల కుయుక్తులను ఛేదించినట్లవుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఇంత వరకు పునాదులు దాటలేదు..

2021 మే 31న మెడికల్ కళాశాలకు ఆర్భాటంగా భూమి పూజ చేసిన వైసీపీ నేతలు తర్వాత ఏడాదిన్నర వరకు పనులు ప్రారంభించిన దాఖలాలే లేవు. ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో మళ్లీ మెడికల్ కళాశాల పనులు అంటూ హడావిడి చేశారే తప్ప దాని నిర్మాణం పూర్తి విషయంలో చిత్తశుద్ధి చూపకపోవడం గమనార్హం.



- ఇంజనీరింగ్ కళాశాలల ఫీజు బకాయిలు చెల్లింపునకు గ్రీన్‌సిగ్నల్
- ఉమ్మడి జిల్లాలో బకాయిలు రూ.80 కోట్లపైనే
- వైసీపీ జమానాలో ఖాతాల్లో జమ కాని ఫీజులు

సర్టిఫికెట్ కష్టాలు తీరినట్లే..

బీటెక్, ఫార్మసీ డిగ్రీ పూర్తి అయినా సర్టిఫికెట్లు చేతికి రాక ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్న ఇంజనీరింగ్, ఫార్మసీ విద్యార్థుల కష్టాలు త్వరలో తీరనున్నాయి. కళాశాలలకు ఉన్న బకాయిల్ని చెల్లించడానికి ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడంతో ఇటు విద్యార్థుల్లో, అటు యాజమాన్యాల్లో హర్షం వ్యక్తం అవుతోంది. గత ప్రభుత్వం చేసిన తప్పిదాలకు నేడు విద్యార్థులు పడుతున్న మానసిక క్షోభకు పరిష్కారం లభించనుంది.

గుంటూరు(విద్య),జులై 17: ఉమ్మడి జిల్లాలో దాదాపు 35కిపైగా ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో బీటెక్, ఫార్మసీ చివరి సంవత్సరం చదివే విద్యార్థులు దాదాపు 15 వేల మందికిపైగా ఉండవచ్చని అంచనా. గత ప్రభుత్వం కళాశాలల వారీగా ఫీజుల్ని నిర్ణయించింది. ఇందులో భాగంగా రూ.40 వేల నుంచి రూ.75 వేలకుపై ఫీజుల్ని కళాశాలల్లో ఉన్న వసతుల్ని బట్టి నిర్ణయించింది. అయితే ఈ ఫీజుల విషయంలో అనేక కళాశాలల యాజమాన్యాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫీజులను సవరించాలని యాజమాన్యాలు అనేకసార్లు కోరినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో అనేక కళాశాలలు నిర్వహణ భారం మోయలేక ఆర్థికంగా కుదేలయ్యాయి.

కొత్త విధానంతో ఇక్కట్లు

ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులో తీసుకువచ్చిన కొత్త విధానం అటు విద్యార్థులకు, ఇటు యాజమాన్యాలకు తలనొప్పిగా పరిణమించింది. గతంలో ప్రభుత్వం చెల్లించే ఫీజులు విడతల వారీగా నేరుగా కళాశాలల ఖాతాలకు జమయ్యేది. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఫీజుల విషయంలో రివర్స్ విధానం తీసుకువచ్చింది. విడతల వారీగా సీఎం జగన్ బటన్ నొక్కి ఫీజుల్ని విద్యార్థుల తల్లుల ఖాతాలకు మళ్ళించారు. ఖాతాల్లో జమ అయిన ఫీజుల్ని బ్యాంకుల నుంచి డ్రా చేసి తల్లులు కళాశాలలకు చెల్లించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అనేక సార్లు బటన్ నొక్కినా ఫీజులు సకాలంలో వారి ఖాతాల్లో జమకాలేదు. ఒకవేళ తల్లుల ఖాతాల్లో డబ్బులు పడినా, వాటిని వారు సొంత అవసరాలకు వాడుకున్న ఉదంతాలు ఉన్నాయి. ప్రతి కళాశాల పరిధిలో కనీసం 35 నుంచి 45శాతం మంది ఇలా ఫీజుల్ని చెల్లించలేదు. ఈ పరిస్థితుల్లో సకాలంలో ఫీజుల చెల్లింపులు జరగక పోవడంతో కళాశాలల నిర్వహణ యాజమాన్యాలకు కష్టంగా మారింది. ఒకవైపు సకాలంలో ఫీజుల బకాయిలు విడుదల కాకపోవడం, వచ్చిన ఫీజుల్ని తల్లిదండ్రులు సకాలంలో చెల్లించక పోవడం వంటి కారణాలు జిల్లాలో నెలకొన్నాయి. ఉమ్మడి జిల్లాలో బీటెక్ చివరి సంవత్సరం వరకు విద్యార్థుల ఫీజుల బకాయిలు రూ.80 కోట్లు వరకు ఉన్నట్లు సమాచారం. దీంతో ఫీజుల బకాయిలు పూర్తి స్థాయిలో చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామంటూ యాజమాన్యాలు విద్యార్థులకు తెగేసి చెప్పాయి. ఫలితంగా బీటెక్, ఫార్మసీ పూర్తి అయినా సర్టిఫికెట్లు చేతికి రాని పరిస్థితి నెలకొంది. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు వచ్చిన విద్యార్థులు, ఎంటెక్ ఇతర కోర్సులకు దరఖాస్తు చేసిన అనేక మంది ఇక చేసేది లేక కళాశాలకు పూర్తిస్థాయిలో బకాయిలు చెల్లించి సర్టిఫికెట్లు తీసుకోవాల్సి వచ్చింది. ఇదిలా ఉంటే ఈ ఏడాది నుంచి పాత పద్ధతిలోనే ఫీజులు చెల్లించడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. నేరుగా కళాశాలల ఖాతాలకే ఫీజులు చెల్లించేలా ఏర్పాట్లు చేస్తుంది.

మొదటి విడత సీట్లు కేటాయింపు పూర్తి

ఏపీఈఏపీసెట్‌లో ర్యాంకులు సాధించి వెబ్ ఆప్షన్లు పెట్టుకున్న వారికి మొదటి విడత సీట్ల కేటాయింపు బుధవారం పూర్తి అయింది. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 17 నుంచి 22లోగా సంబంధిత కళాశాలల్లో రిపోర్టు చేయాలని ఉన్నత విద్యామండలి ప్రకటించింది. ఉమ్మడి జిల్లాలో కొన్ని పేరున్న కళాశాలల్లో మాత్రమే పూర్తిస్థాయి సీట్లు భర్తీ అయ్యాయి. త్వరలో నిర్వహించే రెండు, మూడు కౌన్సెలింగ్‌లలో సీట్లు భర్తీ అయ్యే అవకాశం ఉందని యాజమాన్యాలు చెబుతున్నాయి.

- కుడి కాలువ ద్వారా విడుదలవుతున్న నీరు



సాగర్ కుడి కాల్వకు నీటి విడుదల

- తొమ్మిది రోజులు 5, 7 గేట్ల ద్వారా దిగువకు
- తాగునీటి కోసం రోజుకు 5500 క్యూసెక్కులు

మాచర్లటౌన్, జూలై 17: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కుడి కాల్వకు బుధవారం తాగునీటిని విడుదల చేశారు. కృష్ణా నది యాజమాన్య బోర్డు ఆదేశాలతో కుడి కాల్వ 5, 7 గేట్ల ద్వారా 5500 క్యూసెక్కుల నీటిని ఓఅండ్ఎం ఈఈ శ్రీహరి స్విచ్చాన్ చేసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈఈ శ్రీహరి మాట్లాడుతూ తాగునీటి అవసరాల నిమిత్తం 4.5 టీఎంసీల నీటిని రోజుకు 5500 క్యూసెక్కుల చొప్పున 9 రోజులపాటు విడుదల చేయనున్నట్లు తెలిపారు. కుడి కాల్వ పరిధిలోని చెరువులు, కుంటలను నింపుకుని తాగునీటి అవసరాల నిమిత్తం వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ మురళీధర్, జేఈ బాబు మియా పాల్గొన్నారు.



నీటిని విడుదల చేస్తున్న ఈఈ శ్రీహరి

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

- గంజాయి నిరోధానికి త్వరలో హెల్ప్‌లైన్
- ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తుషార్‌డూడీ




బాపట్ల, జూలై 17: బాపట్ల ఎస్పీగా తుషార్ డూడీ బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వేదమంత్రోచ్చరణల మధ్య బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీసు అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి జిల్లాలోని శాంతిభద్రతలు గురించి చర్చించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు చిన్నపిల్లలపై జరిగే నేరాల మీద ప్రత్యేక దృష్టిపెడుతామన్నారు. పెండింగ్ కేసుల విచారణలో సాంకేతికతను జోడించుకుని వేగంగా దర్యాప్తు చేస్తామన్నారు. సముద్రతీరప్రాంతంలో భద్రతా చర్యలపైమరింత దృష్టిపెడతామన్నారు. నిష్పక్షపాతంగా సేవలందిస్తూ ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరు స్వేచ్ఛగా పోలీసు స్టేషన్‌కు వచ్చి వారి సమస్యలు చెప్పుకునే విధంగా చూస్తామని, గంజాయి,ఇతర మాదక ద్రవ్యాల కట్టడిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఆసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలియపర్చడానికి హెల్ప్‌లైన్‌ను ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఏ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, డీఎస్పీలు సి.హెచ్.మురళీకృష్ణ, టి.మురళీకృష్ణ, పి.జగదీష్‌నాయక్, సీఐలు, ఎస్ఐలు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు.

మడ.. మాయం

- తీర రక్షణ చెట్లు తొలగింపు

చీరాల, జూలై 17: తీరంలో రక్షణగా ఉండే మడ చెట్లు(సరిగ) మాయం అవుతున్నాయి. దీంతో విపత్తుల సమయంలో ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయినా సంబంధిత శాఖల అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేట నిషేధ సమయంలో మత్స్యకారుల జీవన భృతి కోసం తీరం వెంట ఉన్న అటవీ శాఖ భూములను వారికి కేటాయించారు. ఆయా భూముల్లో లబ్ధిదారులు మడచెట్లతో పాటు సరిగ తదితర మొక్కలను సాగు చేసుకుని, వాటిపై వచ్చే ఫలసాయాన్ని పొందాలి. ఇదీ నిబంధన. అయితే వాడరేవు నుంచి రామాపురం, కఠారివారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం వరకు తీరం వెంట రిసార్టులు వెలిశాయి. రిసార్టుల నిర్వాహకుల్లో కొందరు సీ వ్యూ పేరుతో తీరానికి రక్షణగా ఉండాల్సిన మడచెట్లను తొలగించారు. సముద్రపు అలలు ఒడ్డుకు చేరి తిరిగి సముద్రంలోకి వెళ్లాలి. మడ చెట్లు అడ్డుగా లేకపోవడంతో కొంతమేర సముద్రపు జలాలు చొచ్చుకువచ్చి కొన్నిచోట్ల గుంతలు ఏర్పడుతున్నాయి. ఇవే ప్రమాదాలకు కారణమవుతున్నాయని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు.

రామాపురం, కఠారివారిపాలెం మధ్య తీరంలో ఓ రిసార్ట్ నిర్వాహకుడు ఏర్పాట్లు (ఫైల్)



దిక్సూచి
DIKSUCHI

లా కోర్సులలో ప్రవేశానికి క్లాట్



దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ లా యూనివర్సిటీలలో ప్రవేశానికి ఉద్దేశించిన 'కామన్ లా అడ్మిషన్ టెస్ట్(క్లాట్) 2025' దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. దీని ద్వారా అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ లా ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ఈ టెస్ట్‌ను 'కన్సార్షియం ఆఫ్ నేషనల్ లా యూనివర్సిటీస్' నిర్వహిస్తుంది. హైదరాబాద్ నల్సార్, విశాఖపట్నం డీఎస్ఎన్ఎల్‌యూ సహా బెంగళూరు ఎన్ఎల్ఎస్ఐయూ, భోపాల్ ఎన్ఎల్ఐయూ, కొచ్చి ఎన్‌యూఏఎల్ఎస్, జోధ్‌పూర్ ఎన్ఎల్‌యూ, ఒడిశా ఎన్ఎల్‌యూఓ తదితర లా కళాశాలలు ఇందులో పార్టిసిపేట్ చేస్తున్నాయి. క్లాట్ 2025లో సాధించిన స్కోర్ ఆధారంగా అభ్యర్థుల చాయిస్‌ను అనుసరించి సీట్లను అలాట్ చేస్తారు. ఈ ఎగ్జామ్‌ను ఆఫ్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు.

అండర్ గ్రాడ్యుయేట్: ఇది అయిదేళ్ల వ్యవధి గల ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్. గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. 2025 మార్చి/ఏప్రిల్‌లో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అర్హులే.


యూజీ క్లాట్ 2025: ఇందులో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఇంగ్లీష్‌లో 22 నుంచి 26 ప్రశ్నలు; కరెంట్ అఫైర్స్-జనరల్ నాలెడ్జ్‌లో 28 నుంచి 32 ప్రశ్నలు; లీగల్ రీజనింగ్‌లో 28 నుంచి 32 ప్రశ్నలు; లాజికల్ రీజనింగ్‌లో 22 నుంచి 26 ప్రశ్నలు; క్వాంటిటేటివ్ టెక్నిక్స్‌లో 10 నుంచి 14 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

పోస్ట్ గ్రాడ్యుయేట్: ఇది ఏడాది వ్యవధి గల ఎల్ఎల్ఎం ప్రోగ్రామ్. ద్వితీయ శ్రేణి మార్కులతో ఎల్ఎల్‌బీ/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. 2025 ఏప్రిల్/మేలో చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ క్లాట్ 2025: ఇందులో మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. కాన్‌స్టిట్యూషనల్ లా, జ్యూరిస్ప్రుడెన్స్, అడ్మినిస్ట్రేటివ్ లా, లా ఆఫ్ కాంట్రాక్ట్, టార్ట్స్, ఫ్యామిలీ లా, క్రిమినల్ లా, ప్రాపర్టీ లా, కంపెనీ లా, పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, ట్యాక్స్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా, లేబర్ అండ్ ఇండస్ట్రియల్ లా అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 15
- **క్లాట్ 2025 తేదీ:** డిసెంబరు 1
- **వెబ్‌సైట్:** www.consortiumofnlus.ac.in

ఓయూలో పార్ట్ టైమ్ పీజీ



హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తున్న యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (యూసీఈ)-పార్ట్ టైమ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. కంటిన్యూయింగ్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(సీఈఈపీ) కింద ఎంఈ/ఎంటెక్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నారు. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించిన ఈ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఎంట్రెన్స్ టెస్ట్, కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. సివిల్, కంప్యూటర్ సైన్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, బయో మెడికల్, మైనింగ్ విభాగాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతి ఇంజనీరింగ్ విభాగంలో 85 శాతం సీట్లను స్థానికులకు ప్రత్యేకించారు.

అర్హతలు: స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్/ఏఎంఐఈ/ఏఎంఐఈటీఈ ఉత్తీర్ణులై ఉండాలి. జూన్ 30 నాటికి కనీసం ఏడాది అనుభవం ఉండాలి. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి ఏదేని ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులు; మాస్టర్స్ డిగ్రీ(ఫిజిక్స్/స్టాటిస్టిక్స్/మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/జియో ఫిజిక్స్) పూర్తిచేసినవారు; ఎమ్మెస్సీ(కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్/కంప్యూటర్ అప్లికేషన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణులు; ఎంసీఏ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. బయో మెడికల్ ఇంజనీరింగ్ విభాగానికి(బీఈ/బీటెక్)(బయో మెడికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఈఐఈ/ఈసీఈ/బయోటెక్నాలజీ/మెడికల్ ఎలక్ట్రానిక్స్) ఉత్తీర్ణులు; ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/మెడికల్ ఎలక్ట్రానిక్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్/మెడికల్ ఫిజిక్స్/బయో ఫిజిక్స్/బయో ఇన్ఫర్మాటిక్స్/బయో మెడికల్ ఇన్ఫర్మాటిక్స్/బయోటెక్నాలజీ) పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. మైనింగ్ ఇంజనీరింగ్ విభాగానికి మైనింగ్ అండ్ మెషినరీ ఇంజనీరింగ్/మైనింగ్ ఇంజనీరింగ్ విభాగాల్లో డిగ్రీ పూర్తిచేసినవారు అర్హులు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 14
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** ఆగస్టు 25
- **వెబ్‌సైట్:** www.uceou.edu

డిప్లొమా ఇన్ రైల్వే ఇంజనీరింగ్

న్యూఢిల్లీలో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ పర్మనెంట్ వే ఇంజనీర్స్(ఇండియా)- డిప్లొమా ఇన్ రైల్వే ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. ఇది కరస్పాండెన్స్ కోర్సు. ఇందులో ఇండియన్ రైల్వేస్‌కు సంబంధించిన స్ట్రక్చర్, ఫంక్షనింగ్ అంశాలు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌నకు కోల్‌కతాలోని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్(ఇండియా) గుర్తింపు ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సైన్స్/కామర్స్/ఇంజనీరింగ్ విభాగాల్లో బీఎస్సీ/బీకామ్/బీఈ ఉత్తీర్ణులు; ఏదేని ఇంజనీరింగ్ విభాగంలో మూడేళ్ల డిప్లొమా ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్/సైన్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి బీఏ డిగ్రీ పూర్తిచేసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** ipweindia.org.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/1ZB524Mలో చదవండి.

ప్రేక్షకులు గుర్తుపెట్టుకునే సినిమా



ఇటీవలే 'ఓమ్ భీమ్ బుష్' చిత్రంతో ప్రేక్షకులను పలకరించారు ప్రియదర్శి. ఆయన, నభానటేశ్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'డార్లింగ్'. 'వై దిస్ కొలవెరీ' అనేది ఉపశీర్షిక. అశ్విన్‌రామ్ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య నిర్మించారు. సినిమా రేపు విడుదలవుతోన్న సందర్భంగా ఆయన మీడియాతో ముచ్చటించారు.

"దర్శకుడు ఈ కథ చెప్పినప్పుడు చాలా బాగా నచ్చింది. స్క్రిప్ట్‌పై పూర్తి నమ్మకం ఉంది. సినిమాకు ఈ టైటిల్‌ను చాలా ప్రేమతో పెట్టాం. కపుల్స్ మధ్య జరిగే సంఘటనలని వినోదాత్మకంగా చూపించే ఈ సినిమా.. రిలేషన్‌షిప్‌లో ఉన్న వారితో పాటు అన్ని వర్గాలనూ ఆకట్టుకుంటుంది. ఇందులో నా ప్రపంచం, నభా ప్రపంచం చాలా వేరుగా ఉంటాయి. భిన్న ధృవాలైన మా ఇద్దరి మధ్య సీరియస్‌గా జరిగే సంఘటనలతో సాగే సన్నివేశాలను ప్రేక్షకులు ఫుల్‌గా ఎంజాయ్ చేస్తారు. స్క్రీన్‌ప్లే చాలా వైవిధ్యంగా ఉంటుంది. 'డార్లింగ్' సినిమాను అందరూ చాలా కాలం గుర్తుపెట్టుకుంటారు" అని ప్రియదర్శి అన్నారు.

ఆగస్టులో భవనమ్ విడుదల



ప్రతిష్ఠాత్మక నిర్మాణసంస్థ సూపర్‌గుడ్ ఫిలిమ్స్ నిర్మిస్తున్న తాజా చిత్రం 'భవనమ్'. 'ది హాంటెడ్ హౌస్' అనేది ఉపశీర్షిక. ఆర్‌బీ చౌదరి, వాకాడ అంజన్‌కుమార్, వీరేంద్ర సిర్వీ నిర్మిస్తున్నారు. సప్తగిరి, ధన్‌రాజ్, షకలక శంకర్, అజయ్, మాళవిక సతీషన్, స్నేహా ఉల్లాల్ ప్రధాన తారాగణం. బాలాచారి కూరెళ్ల దర్శకత్వం వహిస్తున్నారు. బుధవారం మేకర్స్ 'భవనమ్' విడుదల తేదీని ప్రకటించారు. ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌ను ఆగస్టు 9న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. ప్రేక్షకుల్ని భయపెట్టడంతో పాటు మంచి హాస్యంతో అలరిస్తుందని చిత్ర బృందం తెలిపింది. సినిమాటోగ్రఫీ: మురళీమోహన్‌రెడ్డి, ఎడిటర్: ఎస్బీఆర్.

'ఏం చేద్దామంటావ్ మరి'...
కల్లు కాంపౌండ్ పాటలో కేసీఆర్ ఊతపదం



● దర్శకుడు పూరి జగన్నాథ్‌పై కేసు నమోదు

రామ్ పోతినేని హీరోగా పూరి జగన్నాథ్ తెరకెక్కిస్తున్న 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం వివాదంలో చిక్కుకుంది. ఈ సినిమా నుంచి ఇటీవలే విడుదలైన 'మార్ ముంత చోడ్ చింత' అనే పాటలో మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్‌రావు వాయిస్‌ను ఉపయోగించడంపై బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు అభ్యంతరం తెలుపుతున్నారు. కల్లు కాంపౌండ్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ గీతంలో 'ఏం చేద్దామంటావ్ మరి' అనే కేసీఆర్ పాపులర్ డైలాగ్‌ను రెండుసార్లు ఉపయోగించారు. వెంటనే పాట నుంచి ఆ హుక్‌లైన్‌ను తొలగించేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు ఎం. రజితారెడ్డి, జీ. సతీష్‌కుమార్ బుధవారం ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. 'పదేళ్ల తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చేసిన కేసీఆర్ వాయిస్‌ను కల్లు కాంపౌండ్‌లో చిత్రీకరించిన ఐటమ్ సాంగ్‌లో ఉపయోగించడం తప్పు. ఇది కేసీఆర్‌ను అవమానించడమే కాక తెలంగాణ ప్రజల మనోభావాలనూ దెబ్బతీసేలా ఉంది' అని ఫిర్యాదులో పేర్కొన్నారు. 'మా ప్రాంత యాస, భాష, మా నాయకుడిని కించపరిచినా సహించేది లేదు, అవసరమైతే పూరి జగన్నాథ్ ఇంటిని ముట్టడిస్తామ'ని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. పాట రచయిత కాసర్ల శ్యామ్, సింగర్ రాహుల్ సిప్లిగంజ్‌పైనా సోషల్ మీడియాలో విమర్శలు వస్తున్నాయి. అయితే ఈ విమర్శలపై చిత్రబృందం ఇంతవరకూ స్పందించలేదు.

త్వరలోనే మీ ముందుకొస్తా



నటించిన అతికొద్ది చిత్రాలతోనే తన సూపర్ యాక్టింగ్‌తో.. మంచి టైమింగ్‌తో నటుడిగా స్పెషల్ ఇమేజ్ తెచ్చుకున్నారు నవీన్ పొలిశెట్టి. 2023లో విడుదలైన 'మిస్.శెట్టి, మిస్టర్ పొలిశెట్టి' చిత్రం తర్వాత ఆయన తెరపై కనిపించలేదు. ఈ విరామానికి గల కారణాన్ని ఆయన సోషల్ మీడియాలో షేర్ చేశారు.

"నేను మీ అందరితో ఓ వ్యక్తిగత విషయాన్ని పంచుకోవాలనుకుంటున్నాను. నేను చేస్తున్న సినిమాల గురించి అప్‌డేట్స్ లేవని అందరూ అడుగుతున్నారు. దానికి కారణం ఇటీవలే జరిగిన బైక్ ప్రమాదంలో నా చేతికి, కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ గాయాల వల్లే నేను సినిమాలను అనుకున్న టైమ్‌కి మీ ముందుకు తీసుకురాలేకపోతున్నాను. ఈ విరామానికి నన్ను క్షమించండి. త్వరలోనే పూర్తిగా కోలుకుని మిమ్మల్ని తిరిగి ఎంటర్టైన్ చేస్తాను" అని పేర్కొన్నారు.

'సర్దార్-2' షూటింగులో స్టంట్‌మేన్ మృతి



తమిళ నటుడు కార్తీ హీరోగా నటిస్తున్న 'సర్దార్-2' చిత్రం షూటింగ్‌లో విషాదం చోటు చేసుకుంది. ఈ సినిమా కోసం ఒక ఫైట్ చిత్రీకరిస్తుండగా, 20 అడుగుల ఎత్తు నుంచి ఫైట్ ట్రైనర్ (స్టంట్‌మేన్) ఏళుమలై ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయాన్ని ఆ చిత్ర నిర్మాణ సంస్థ ప్రిన్స్ పిక్చర్స్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. స్థానిక సాలిగ్రామంలోని ప్రసాద్ స్టూడియోలో మంగళవారం ఫైట్ మాస్టర్ సూపర్ సుబ్బరాయన్ పర్యవేక్షణలో ఫైట్ రిహార్సల్ చేస్తుండగా ఈ సంఘటన జరిగింది. ఏళుమలై కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని నిర్మాత లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

ఆరోగ్యంగానే ఉన్నా

ఆర్.నారాయణమూర్తి



ప్రజానటుడు ఆర్.నారాయణమూర్తి స్వల్ప అస్వస్థతతో బుధవారం నిమ్స్ అసుపత్రిలో చేరారు. ఆయనను ప్రత్యేక విభాగంలో ఉంచి నిమ్స్ డైరెక్టర్ బీరప్ప ఆధ్వర్యంలో వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించారు. గతంలో ఆయనకు ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగి ఉండటంతో హృద్రోగ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ పరీక్షలను వైద్యులు చేసి, ప్రమాదం ఏమీ లేదని నిర్ధారించారు. గ్యాస్ట్రిక్ సమస్య అయి ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. నారాయణమూర్తికి ఏమైందంటూ సోషల్ మీడియాలో చర్చ జరుగుతుండడంతో ' నేను ఆరోగ్యంగా ఉన్నా. అభిమానులూ ఆందోళన చెందకండి. దేవుడి దయ వల్ల బాగానే ఉన్నా. పూర్తిగా కోలుకున్న తర్వాత అన్ని వివరాలూ వెల్లడిస్తా' అని ఓ ప్రకటనలో తెలిపారు నారాయణమూర్తి.



తన భర్త నికోలై సచ్‌దేవ్‌తో కలసి వరలక్ష్మి బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో ముచ్చటించారు. 'హైదరాబాద్ నాకు సెకండ్ హోమ్.. మీరంతా నాకు చాలా సపోర్ట్ చేశారు. ఇక ముందు కూడా ఇలానే సహకరించాలి' అని కోరారు వరలక్ష్మి

'బడ్డీ' వచ్చేది ఎప్పుడంటే..!



అల్లు శిరీష్ హీరోగా నటిస్తున్న 'బడ్డీ' చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదల కోసం తుదిమెరుగులు దిద్దుకుంటోంది. అడ్వెంచరస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో గాయత్రీ భరద్వాజ్, ప్రిషా రాజేశ్ సింగ్ హీరోయిన్లు. శామ్ ఆంటోనీ దర్శకుడు. ఈ చిత్రాన్ని ఆగస్టు 2న విడుదల చేయనున్నట్లు నిర్మాతలు జ్ఞానవేల్ రాజా, అధన చెప్పారు. ఈ చిత్ర నిర్మాణం ఇండియన్ సిల్వర్ స్క్రీన్ మీద కొత్త ప్రయత్నం అని వారు చెప్పారు. సంగీత దర్శకుడు హిప్ హాప్ తమిళ స్వరపరిచిన పాటలు మంచి ఆదరణ పొందాయని చెప్పారు.

టికెట్ రేట్లు తగ్గించాలి



వినోద్ కిషన్, అనూష కృష్ణ జంటగా రూపుదిద్దుకున్న 'పేకమేడలు' చిత్రం ఈ శుక్రవారం విడుదలవుతోంది. నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రాకేశ్ వర్రె నిర్మించారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో చిత్రాన్ని విడుదల చేస్తున్న నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ 'పెద్ద సినిమాల టికెట్ రేట్లు ఎంత ఉన్నా ప్రేక్షకులు థియేటర్‌కు వస్తారు. ఇలాంటి చిన్న సినిమాలకు తక్కువ రేట్లు ఉండాలి. అందుకే టికెట్ రేటు వంద రూపాయలు పెట్టాం. ఇలాంటి మంచి సినిమాను ప్రేక్షకుల దగ్గరకు తీసుకెళ్లాలని పెయిడ్ ప్రీమియర్స్ కు రూ 50 పెట్టాం. సినిమా బాగుందని ప్రతి ఒక్కరూ చెప్పారు. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది' అని చెప్పారు. చిత్ర నిర్మాత రాకేశ్ వర్రే మాట్లాడుతూ 'ఈ సినిమా విడుదల చేయడానికి ముందుకు వచ్చిన ధీరజ్‌కు ధన్యవాదాలు. అలాగే మా సినిమాకు సపోర్ట్ చేసిన రానా దగ్గుబాటి, అడవి శేష్, విష్వక్‌సేన్‌కు కృతజ్ఞతలు' అన్నారు. పెయిడ్ ప్రీమియర్స్‌కు వస్తున్న రెస్పాన్స్ చూసి చాలా ఆనందంగా ఉందని వినోద్ కిషన్ చెప్పారు.

ల్యాండ్ టైటిల్లింగ్ యాక్ట్ రద్దు హర్షణీయం

- రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ ప్రజారంజక పాలన ప్రారంభం
- సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జూలై 17: ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు బిల్లుకు మంత్రి వర్గం ఆమోదం తెలపటం హర్షణీయమని సత్తెనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధ వారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో భాగంగా ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు బిల్లును మంత్రివర్గం ఆమోదించిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వేను ప్రభుత్వం నిలిపి వేయటంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలోని వ్యవస్థలను చిన్నాభిన్నం చేసి ఆర్థిక విధ్వంసానికి పాల్పడిందని, ఆ సంక్షోభ భారాలను తట్టుకొని కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి అజెండాలతో ముందుకు వెళుతూ ఎన్నికల హామీల అమలు దిశగా పయనిస్తుందన్నారు. పనిచేస్తున్న ప్రభుత్వంపై కొంత మంది వైసీపీ నేతలు తప్పుడు ఆరోపణలు చేయటం మానుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఇసుక విధానంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వ ఇసుక విధానంతో భవన నిర్మాణ కార్మికులు రోడ్డునపడి ఆత్మహత్యలు చేసుకున్నారన్న విషయాన్ని కన్నా గుర్తుచేశారు. ఆగస్టు 15 నుంచి అన్నక్యాంటీన్‌ల సేవలు ప్రారంభం కానున్నా యన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న పథకాలను అమలు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందన్నారు.పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాలు కూడా ప్రభుత్వం పూర్తి చేస్తుందన్నారు. నియోజక వర్గ ప్రజలకు కన్నా లక్ష్మీనారాయణ తొలి ఏకాదశి, మొహరం శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్టీసీ కార్మికులను మోసం చేసిన జగన్‌రెడ్డి

- చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుని సత్కరిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

చిలకలూరిపేట అర్బన్, జూలై 17 : ఆర్టీసీ కార్మికులను మాజీ సీఎం జగన్‌రెడ్డి నమ్మించి మోసం చేశాడని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం చిలకలూరిపేట ఆర్టీసీ డిపో ఉద్యోగ సంఘాల నేతలు ఎమ్మెల్యే ప్రత్తిపాటిని మర్యాద పూర్వకంగా కలసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారితో ఎమ్మెల్యే ప్రత్తిపాటి మాట్లాడుతూ.. విలీనం పేరిట ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల హక్కులను, ప్రయోజనాలను కాలరాసివేసి వారు కోలుకోలేని విధంగా దెబ్బతీసిన దుర్మార్గుడు జగన్ అని మండిపడ్డారు. సంక్షోభంలో కూరుకుపోయిన ఆర్టీసీకి పునర్జీవింప చేయటం కోసం కూటమి ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. కొత్త బస్సుల కొనుగోలు, సర్వీసుల పెంపు, కార్మికుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ప్రణాళికతో ఉన్నారని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆర్టీసీ మరింత ఆదరణ, ఆదాయం రెండు పెరుగుతాయన్నారు. 2019 ఎన్నికల్లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తానని హామి ఇచ్చిన జగన్ పేరుకు చేసినా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అన్ని ప్రయోజనాలు కల్పించ లేదు సరి కదా ఆర్టీసీలో ఉన్నప్పుడు వారు పొందిన అనేక సదుపాయలకు కోత విధించారని మండి పడ్డారు. బకాయిలను చెల్లించ లేదని, విలీనం జరిగి ఏళ్ళు గడుస్తున్నా వారికి ఏ పింఛన్ ఇస్తారో చెప్పలేదని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఆ సమస్య లన్నీ పరిష్కరించాల్సి ఉందన్నారు.

ప్రజా దర్బార్‌కు విన్నపాల వెల్లువ

- 17వ రోజు వెల్లువెత్తిన ప్రజానీకం
- వినతులు స్వీకరించి పరిష్కరిస్తానన్న మంత్రి లోకేశ్


దివ్యాంగుల నుండి అర్జీలు స్వీకరిస్తున్న నారా లోకేశ్

తాడేపల్లి, జులై 17: రాష్ట్ర మంత్రి, యువనేత నారా లోకేశ్ ప్రవేశ పెట్టిన ప్రజాదర్బార్‌కు బుధవారం అర్జీదారులు వెల్లువెత్తారు. కరకట్ట ఆసాంతం అర్జీదారులతో నిండిపోయింది. 17వ రోజు బుధ వారం పలువురు తమ అర్జీలను నారా లోకేశ్‌కు అంద జేసి సమస్యలు పరిష్కరించాలని విన్నవించగా లోకేశ్ సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సైతం ప్రజలు భారీగా విచ్చేశారు.

బోధన, బోధనేతర ఉద్యోగులకు టైమ్ స్కేల్ వర్తింపజేయాలి

ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ మిని గురుకులాల్లో పని చేస్తున్న బోధన, బోధనేతర ఉద్యోగులకు టైమ్ స్కేల్ వర్తింపజేయాలని సిబ్బంది లోకేశ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. గ్రామ సచివాలయాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న తమకు విపరీతమైన పని భారం పెరిగి ఇబ్బందులు పడుతున్నామని తగిన న్యాయం చేయాలని సెక్రటరియేట్ ఇంజనీరింగ్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న ఐటి మేనేజర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలు, డీఈవోలు ఆఫీస్ సబార్డినేట్లకు కాంట్రాక్టు పద్ధతి వర్తింపజేయాలని సిబ్బంది కోరారు.

ప్రేమ వివాహం చేసుకున్న కుమారుడిని హత మార్చారు..

ప్రేమ వివాహం చేసుకున్న తమ కుమారుడిని గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతల అండతో యువతి కుటుంబం కిరాతకంగా హతమార్చారని, తగిన న్యాయం చేయాలని మంగళగిరి మండలం నవులూరుకు చెందిన సత్తెనపల్లి రామాంజనేయులు మంత్రి లోకేశ్‌ను కలిసి కన్నీటిపర్యంతమయ్యారు. గుంటూరు లోని ప్రైవేటు ఆసుపత్రిలో డ్యూటీ డాక్టర్‌గా పనిచేస్తున్న తన కుమారుడు సత్తెనపల్లి సీతారామాంజనేయులు పాకనాటి స్వాతి ప్రేమ వివాహం చేసుకున్నారు. అది ఇష్టంలేని యువతి తండ్రి శ్రీనివాసరెడ్డి వారి కుటుంబసభ్యుల సాయంతో కిరాతకంగా హత్యచేశాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలు విన్న మంత్రి లోకేశ్ పరిశీలించి తగిన చర్య తీసుకుంటామన్నారు.

గల్లా జయదేవ్ కాలనీవాసుల వినతి

మంగళగిరి పట్టణం ఇప్పటం రోడ్డులోని గల్లా జయదేవ్ కాలనీ వాసులు మంత్రి లోకేశ్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించారు. కాలనీలో 80 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని తాగునీరు సక్రమంగా అందడం లేదని డ్రెయినేజీ వ్యవస్థ సరిగ్గా లేక మురుగు నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న సీసీరోడ్ల నిర్మాణం పూర్తిచేయాలని కోరారు. నూతన పెన్షన్లతో పాటు గత ప్రభుత్వం తొలగించిన రేషన్ కార్డులు, వృద్ధాప్య, వితంతు పింఛన్లు పునరుద్ధరించాలని మంగళగిరి నియోజకవర్గంకు చెందిన పలువురు విజ్ఞప్తి చేశారు. వినతులు స్వీకరించిన లోకేశ్ వారి సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.



మంత్రి నారా లోకేశ్‌కు అర్జీలు అందిస్తున్న ప్రజలు

వాస్తవాలు తెలిపేందుకే శ్వేతపత్రాలు

- ఐదేళ్ల వైసీపీ పాలనలో వ్యవస్థలు అస్తవ్యస్తం
- వేల కోట్ల రూపాయలు దోచుకున్న వైసీపీ నేతలు
- గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు


గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, జూలై 17: ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలు, దోపిడీలపై ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు సీఎం చంద్రబాబునాయుడు శ్వేత పత్రాలు విడుదల చేయడం జరిగిందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ పాలకులు ఏ విధంగా అక్రమాలు, దందాలుచేసి ఎంత దోచుకున్నారో ఆధారాలతో సహా శ్వేతపత్రాలలో బయట పెడుతున్నార న్నారు. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో దాదాపు 1.75 లక్షల ఎకరాల భూ ఆక్రమణలు జరిగాయని, వాటివిలువ 33,576 కోట్లపైనే వుంటుందని, ఇళ్ల పట్టాల పేరుతో 10వేల ఎకరాలు, ఇసుక దందాలో 9,750 కోట్లు వైసీపీ నేతలు అక్రమంగా దోచుకున్నారని ఎమ్మెల్యే యరపతినేని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ జీవో 512ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రద్దు చేయడం జరిగిందని, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో వైసీపీ నేతలు భూదోపిడికి పాల్పడేందుకు కుట్ర పన్నారన్నారు. తక్కువ ధరకు రైతుల నుండి భూములు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు ప్రభుత్వానికి అమ్మిన వైసీపీ నేతల భాగోతాల గురించి సాక్షాదారాలతో సహా శ్వేతపత్రంలో పొందుపరచడం జరిగిందన్నారు. విశాఖలో రామానాయుడు స్టూడియో భూములను, వృద్ధాశ్రమానికి ఇచ్చిన హాయగ్రీవ భూములను తిరుపతి, రేణిగుంట సమీపంలోని మఠం భూములను, పుంగనూరులో 982 ఎకరాలను వైసీపీ నేతలు కొట్టేశారన్నారు. దస్పల్లా భూములను సైతం కొట్టేసి ఇల్లు కట్టుకున్నారని, చిత్తూరులో 782 ఎకరాలు, ఒంగోలులో నకిలీ పత్రాలతో 101 కోట్ల ఆస్తిని కాజేసేందుకు వైసీపీ నేతలు యత్నించే ప్రయత్నంచేశారని, వీటిపై విచారణ జరుపుతామని యరపతినేని తెలిపారు. 13,800 ఎకరాల ఆవ భూములను వైసీపీ నేతలకు ధారాదత్తం చేశారని, తక్కువ ధరకు 40వేల ఎకరాలు కొని అధికారులను బెదిరించి ఆ భూములకు పట్టాలు తెప్పించుకున్నారని, రుషికొండలో 500 కోట్లతో ప్యాలెస్ కట్టి ప్రజాధనాన్ని వృధాచేశారని, భూహక్కు పత్రం పేరుతో ప్రచారానికి 13 కోట్లు వైసీపీ ప్రభుత్వం ఖర్చుచేసిందని, వైసీపీ కార్యాలయాల కోసం ప్రతి జిల్లాలో 2ఎకరాలు చొప్పున నామ మాత్రపు లీజుతో 33 ఏళ్ల లీజు పొందారని, మొత్తం 300 కోట్ల విలువైన భూమిని కేటాయించుకున్నారన్నారు. కొండలను సైతం జగన్‌రెడ్డి ప్రభుత్వం అనకొండలా మింగేశారని, ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ ఎమ్మెల్యేలే అక్రమంగా భూగర్భ వనరులను తవ్వేశారన్నారు. వైసీపీ నేతలు ఇసుకాసురల అవతార మెత్తి ఇసుకను మింగి వందలాది టిప్పర్ల ఇసుకను అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలి స్తున్నా పట్టించుకోకపోవడంతో కోట్లాది మంది భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరువైందన్నారు. నూతన ఇసుక విధానంతో ఉచిత ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తీసుకు రావడంతో భవననిర్మాణ కార్మికులు, వారి కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఎమ్మెల్యే యరపతినేని తెలిపారు.

ఆర్వీఆర్‌జేసీలో నూరుశాతం సీట్లు భర్తీ

- కంప్యూటర్‌తో పాటు, సంప్రదాయ కోర్సులకు డిమాండ్

గుంటూరు(విద్య),జులై 17: ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్లు భర్తీ కోసం ఉన్నత విద్యామండలి నిర్వహించిన ఏపీఈఏపీసెట్ కన్వీనర్ కోటా వెబ్‌కౌన్సిలింగ్‌లో ఆర్వీఆర్‌జేసీలోని అన్నిబ్రాంచీల సీట్లు నూరు శాతం భర్తీ అయ్యాయని ఈ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కే.మద్దినేనిలు బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులలో కంప్యూటర్ కోర్సులైన సీఎస్‌ఇ, సీఎస్‌ఎం, సీఎస్‌డి,ఐటీ, సీఎస్‌బీ, సీఎస్‌వో, ఈసీఈ తోపాటు సంప్రదాయ కోర్సులైన సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, కెమికల్ ఇంజనీరింగ్ బ్రాంచీలకు డిమాండ్ ఏర్పడిందని, ఆయా బ్రాంచీల్లో సైతం సీట్లు నూరుశాతం భర్తీ అయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తెలిపారు.


రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

10 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరుటౌన్, జూలై17: పేదలకు దక్కాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న వాహనాన్ని రూరల్ పోలీసులు బుధ వారం అర్ధరాత్రిస్వాధీనం చేసుకున్నారు. రూరల్‌పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బ్రహ్మణకోడూరు అడ్డరోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా వెళ్తున్న లారీని ఆపి సోదాలు నిర్వహించారు. ఈ లారీలో పది టన్నుల రేషన్ బియ్యం బస్తాలను గుర్తించి వాహనంలో ప్రయాణీస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రేషన్ బియ్యం కొల్లూరు నుంచి గుంటూరు వెళ్లతునట్లుగా అధికారులు అనుమానిస్తున్నారు. బియ్యం లారీని స్వాధీనం చేసుకోవటంతోపాటు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై భార్గవ్ వెల్లడించారు.


అఖండ జ్యోతిని వెలిగించిన ఎంపీ శ్రీ కృష్ణదేవరాయులు, ఎస్పీ కే.శ్రీనివాస రావు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావు తదితరులు

వైభవంగా రామలింగేశ్వరస్వామి తిరునాళ్ల

- ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి భక్తుల రాక

వినుకొండ టౌన్, వినుకొండ, జూలై 17: తొలి ఏకాదశి పండుగ సందర్భంగా వినుకొండ కొండపై రామలింగేశ్వరస్వామి తిరునాళ్ల మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హిమాలయ గురువు ఆధ్వర్యంలో చేపట్టిన హోమాల్లో పాల్గొన్నారు. శాంతి ఆశ్రమ ట్రస్ట్ వ్యవస్థాపకులు హిమాలయ గురూజీ ఆధ్వర్యంలో కొండపై అఖండజ్యోతి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు, సాయంత్రం 6.30 నిమిషాలకు అఖండజ్యోతిని ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు, పల్నాడు జిల్లా ఎస్పీ కే.శ్రీనివాసరావు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు చేతుల మీదుగా హిమాలయ గురూజీ వెలిగించారు.

పశ్చిమడెల్టాకు 2519 క్యూసెక్కులనీరు

దుగ్గిరాల, జూలై 17: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టాకాల్వకు 2519 క్యూసెక్కుల సాగునీటిని బుధవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బ్యారేజివద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్ డివిజన్ నుంచి రేపల్లెకాల్వకు 611 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 135 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 1393 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

త్రిపురాపురం కొండపై మట్టి మైనింగ్

- అడ్డుకున్న తహసీల్దార్, పోలీసులు
- ఒక ప్రొక్లెయినర్, రెండు ట్రాక్టరులు స్వాధీనం

నకరికల్లు, జూలై 17 : ప్రభుత్వ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే కొందరు అక్రమార్కులు యదేచ్ఛగా మట్టి మైనింగ్‌కి పాల్పడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. నకరికల్లు మండలం త్రిపు రాపురం గ్రామ సమీపాన అద్దంకి -నార్కెట్‌పల్లి ప్రధాన రహదారికి సమీపాన ఉన్న కొండ మట్టిని కొల్లగొట్టి అక్రమార్కులు జేబులు నింపుకుంటున్నారు. బుధవారం నకరికల్లుకు చెందిన ఒక వ్యక్తి అక్రమ మైనింగ్‌కి సంబందించిన ఫోటోలు తీసి తహసీల్దార్, ఆర్డీవో, ఇతర అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన సత్తెనపల్లి ఆర్డీవో వీ.మురళీకృష్ణ అక్రమంగా మైనింగ్ చేస్తున్న వాహనాలను, అందుకు కారకులను తక్షణమే అదుపులోకి తీసుకోవాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణకు, పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. వెంటనే తహసీల్దార్ లక్ష్మీనారాయణ పోలీసు అధికారులతో కలసి త్రిపురా పురం కొండ వద్దకు చేరుకొని అక్రమ మైనింగ్‌ను అడ్డుకున్నారు. ఒక ప్రొక్లైనర్, 2 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ మైనింగ్‌లో అక్రమార్కుల పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం వెల్లడి కావాల్సి ఉంది.


మైనింగ్ చేస్తున్న ప్రాంతానికి వెళ్లి అడ్డుకున్న తహసీల్దార్ ఎల్ లక్ష్మీనారాయణ, పోలీసులు అధికారులు


మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు


విద్యార్థులకు స్కాలర్‌షిప్పుల చెక్కులను పంపిణీ చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ లీలావతి, సాయిరామ్ తదితరులు

విద్య ద్వారానే సమాజాభివృద్ధి

- పేద విద్యార్థుల విద్యోన్నతికి స్వచ్ఛంద సంస్థలు చొరవ చూపాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారధి
- 1600 మందికి రూ.50 లక్షల విలువైన మెరిట్ స్కాలర్‌షిప్‌ల పంపిణీ

గుంటూరు, జూలై 17: విద్య ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారధి తెలిపారు. పెదపలకలూరులో యేరువ కోటిరెడ్డి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు బుధవారం 1600 మంది విద్యార్థులకు రూ.50 లక్షల విలువైన మెరిట్ స్కాలర్‌షిప్స్ పంపిణీ చేశారు. సీనియర్ న్యాయవాది పోలూరి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారధి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల చెక్కులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బు సంపాదించే వారిలో ఎక్కువ మంది ఆస్తులు పెంచుకునేందుకు ఆలోచన చేస్తుంటారని, కానీ ఇలా సమాజం కోసం డబ్బువెచ్చించే వాళ్ళు చాలా అరుదుగా ఉంటారన్నారు. పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం యేరువ కోటిరెడ్డి ఎడ్యుకేషనల్ ఆధ్వర్యంలో స్కాలర్షిప్‌లు అందించడం స్ఫూర్తిదాయకమన్నారు. ప్రస్తుతం స్కాలర్‌షిప్పులు తీసుకునేవారు విద్యా, ఉపాధి రీత్యా ఉన్నత స్థానాలకు చేరుకొని తిరిగి స్కాలర్‌షిప్పులు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఉద్యోగ రీత్యా విదేశాల్లో స్థిరపడినప్పటికీ సొంత ఊరిలో విద్యాభివృద్ధి కోసం యేరువ సాయిరామ్ కృషి చేయడం అభినందనీయమన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ లీలావతి మాట్లాడుతూ మైనర్ డ్రైవింగ్ నియంత్రణకు తల్లితండ్రులు తగిన చొరవ చూపాలన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులే జాగ్రత్త వహించాలని సూచించారు. యేరువ కోటిరెడ్డి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఛైర్మన్ యేరువ సాయిరామ్ మాట్లాడుతూ తన సొంతూరికి ఎంతో కొంత సాయం చేయాలన్న ఉద్దేశ్యంతోనే తన తండ్రి పేరు మీద ట్రస్ట్‌ని ఏర్పాటు చేశానన్నారు. పలకలూరు హైస్కూల్లో భవనం నిర్మించడంతో ఆరంభమైన స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం విరామం లేకుండా నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. మొత్తం 52 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూలుకి రూ. 36,000 చొప్పున, అలాగే డిగ్రీ, బీటెక్, మెడిసిన్ వివిధ రకాలైన కోర్సులు చేస్తున్న 500 మందికి ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున అందజేశామన్నారు. సుమారుగా 54 వేల డాలర్లు అంటే రూ.45 లక్షల ఇవ్వడం గర్వంగా ఉందన్నారు. ఈ స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ఇకపైనా కొనసాగిస్తామని వైకేఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మెంబర్ పోలూరు వెంకటరెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో విజ్ఞాన్ కళాశాల ప్రిన్సిపాల్ పాతూరి రాధిక, గుళ్ళపల్లి సుధీర్, నూనె గంగాధర్ రెడ్డి, యేరువ జగదీశ్వరి, యేరువ శ్రీవేణి, యేరువ శ్రీలలిత, పాల వరప్రసాద్, యేరువ రమణి పాల్గొన్నారు.


బాలిక కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

బాలిక హత్య అమానుషం

- ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్
- గుంటూరులో బాలిక కుటుంబ సభ్యులకు పరామర్శ

పొన్నూరుటౌన్, జూలై17: బాలిక హత్య అమానుషమని పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. ఇటీవల చేబ్రోలు కొత్తరెడ్డిపాడు గ్రామంలో హత్యకు గురైన బాలిక కుటుంబ సభ్యులను బుధవారం ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ గుంటూరులో కలిసి పరామర్శించారు. బాలిక శైలజ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఇలాంటి అమానీయ ఘటనలను ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. ఆడబిడ్డలపై చోటుచేసుకుంటున్న అఘాయిత్యాలు అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇలాంటి ఘటనల్లో నిందితులు శిక్షించేందుకు హోం శాఖ ప్రత్యేక ఫోర్సును ఏర్పాటుచేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తునట్లు తెలిపారు. బాలిక హత్య ఘటనలో నిందితుడిని అరెస్టుచేసి కఠినంగా శిక్షిస్తామని బాధిత కుటుంబానికి బరోసా కల్పించారు. బాలిక కుటుంబాన్ని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. పోలీసు అధికారులతో మాట్లాడి నిందితుడిని త్వరగా అరెస్టు చేసేలా చూస్తామని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ వివరించారు. ఆయనతో పాటు టీడీపీ నేతలు ఉన్నారు.

జిల్లా స్థాయిలో విత్తన నిఘా బృందాలు

- జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

గుంటూరు సిటీ, జూలై 17 : నకిలీ విత్తనాలను ఆదిలోనే నిరోధించేందుకు జిల్లా స్థాయిలో విత్తన నిఘా బృందాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి' లో 'నకిలీ విత్తనాల ఖిల్లా' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఈ నేపథ్యంలో విడుదల చేసిన పత్రికా ప్రకటనలో నకిలీ విత్తనాలు కట్టడి చేసేందుకు గుంటూరు జిల్లాలో అనేక చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. ఎక్కడా నకిలీ విత్తనాల జాడ లేదని స్పష్టం చేశారు. ఆటోనగర్, మాంచెస్టర్ రోడ్డులో లూజు విత్తనాలు తీసుకు వచ్చి శుద్ధి చేస్తున్నట్లు వచ్చిన ఆరోపణల్లో ఖచ్చితత్వం లేదన్నారు. గత రెండు సంవత్సరాలుగా ఈ జిల్లా నుండి విత్తనాలు కొనుగోలు చేసిన ఏ ఒక్క రైతు తను నకిలీలతో మోసపోయానని ఫిర్యాదు చేయలేదని తెలిపారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులు అరికట్టేందుకు జిల్లా వ్యవసాయ యంత్రాంగం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఈ నెలలో రాష్ట్ర స్థాయి బృందాలు జరిపిన దాడుల్లో రూ.20 కోట్ల నకిలీ విత్తనాలు పట్టుబడలేదని తెలిపారు. రూ.8.91 లక్షల పత్తి, మిరప, వరి విత్తనాలు పట్టుబడ్డాయని అవి నకిలీవి కాదని, సరైన పత్రాలు, స్టాక్ బోర్డులు లేనందున వాటి అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశాలు జారీచేశామన్నారు. విత్తన నిబంధన చట్టం పాటించని రూ.24.41 లక్షల విత్తనాలను అమ్మకాలు నిలిపి వేయాలని ఆదేశించామన్నారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు జాడ కనపడితే జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెల్ కు ఫిర్యాదు చేయాలని, నేరుగా రాలేని పక్షంలో సెల్ నెంబర్:8331056914,8331057038 కి ఫిర్యాదు చేయవచ్చు అని తెలిపారు.

ట్రాన్‌ఫార్మర్లలో రాగి వైరు దొంగలింత

తుళ్లూరు, జులై 17: పొలాల్లో ఉన్న మూడు కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఉన్న రాగి వైరు దొంగలించిన విషయపై తుళ్లూరు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. మల్కాపురం వాసి రైతు గద్దె చంద్ర శేఖర్ మందడం రెవెన్యూలో 6 ఎకరాలలో అరటి తోట సాగు చేస్తున్నారు. అందులో ఉన్న ట్రాన్స్ ఫార్మర్లలో రాగి వైరును దండగులు దొంగిలించారు. దీనిపై తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సీఐ-2 అనురాధ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122, 133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



ప్రత్యేక కౌంటర్ ద్వారా బియ్యం, కందిపప్పు అందజేస్తున్న డీఎస్‌వో, తహసీల్దార్

బియ్యం, కందిపప్పు కౌంటర్లు ప్రారంభం

● జిల్లాలో 25 ప్రత్యేక కౌంటర్‌లలో విక్రయాలు ● డీఎస్‌వో విలియమ్స్

కర్లపాలెం, జూలై 17 : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అధిక ధరలను నియంత్రించటానికి, ప్రజలందరికి తక్కువ ధరలో బియ్యం, కందిపప్పు అందించటానికి ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటు చేసిందని బాపట్ల జిల్లా పౌరసరఫరాల అధికారి విలియమ్స్ అన్నారు. కర్లపాలెం సెంటర్‌లో రైస్‌మిల్లు వద్ద బుధవారం కందిపప్పు, బియ్యం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయగా డీఎస్‌వో విలియమ్స్, తహసీల్దార్ నిర్మలానందాబాబా రైస్ మిల్లర్స్‌తో కలిసి ప్రారంభించారు. నాణ్యతా కలిగిన కిలో బియ్యం రూ.49, కిలో కందిపప్పు రూ.160కు ప్రత్యేక కౌంటర్‌లో విక్రయిస్తారని, ఎవరికి ఎన్ని కావాలన్నా కౌంటర్‌లో కొనుగోలు చేసుకోవచ్చు అని విలియమ్స్ తెలిపారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల హెడ్‌క్వార్టర్స్‌లో, మండల కేంద్రాలలో బియ్యం, కందిపప్పు ప్రత్యేక కౌంటర్లను ప్రారంభిస్తున్నామని విలియమ్స్ అన్నారు. ప్రత్యేక కౌంటర్‌లో మహిళలకు బియ్యం, కందిపప్పును తహసీల్దార్, డీఎస్‌వోలు మొట్టమొదటిగా విక్రయించి కౌంటర్ ప్రారంభించారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ ఓంకార్, రైస్ మిల్లర్స్ అధ్యక్షులు పబ్బిశెట్టి వెంకటరంగారావు, కేవీఎస్ ప్రసాద్, పీవీ సత్యనారాయణ, బొమ్మిశెట్టి ప్రభాకరరావు, ఆర్.నాగిరెడ్డి, యక్కల భారత్, కొమ్మూరు రవి, టీడీపీ నాయకుడు, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, గుంపుల కన్నయ్య, కట్టా సుజాత, బొద్దుకూరి విజయ, పఠాన్ అహ్మద్‌బాషా పాల్గొన్నారు.

బాపట్ల జీవనాడి టౌన్ హాలు

● ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ సాయిబాబు

బాపట్ల, జూలై 17 : సర్వకళల కేంద్రంగా, బాపట్ల జీవ నాడిగా టౌన్‌హాలు విరాజిల్లుతున్నదని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబు అన్నారు. చారిత్రక టౌన్‌హాలు 119వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో టౌన్‌హాలులోని తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి డాక్టర్ పీసీ సాయిబాబు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాదిగా ఎన్నో సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు పట్టుగొమ్మగా నిలిచిందన్నారు. తెలుగుప్రజల స్వరాష్ట్ర వాంఛకు టౌన్‌హాలు ముత్యాల పందిరి వేసిందన్నారు. ఎందరో జాతీయ నాయకుల ప్రసంగాలకు సాక్షిభూతంగా నిలిచిందన్నారు. 1913లో ప్రథమాంధ్ర మహాసభ ఇక్కడ జరగటం ఇలా టౌన్‌హాలు ఆంధ్రోద్యమానికి పురుడుపోసిందన్నారు. భాషాప్రయుక్త రాష్ట్ర వాదనకు బీజం వేసిందన్నారు. టౌన్‌హాలుకు 1905 జూలై 17న అప్పటి గుంటూరు జిల్లా కలెక్టర్ బ్రూడీ ప్రారంభోత్సవం చేశారని, టౌన్‌హాలుది 12 దశాబ్దాల చరిత్ర అని ఇది ఎందరో కవులు, కళాకారులకు ఆలంబనగా నిలిచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి, పౌరసమాఖ్య నాయకులు డాక్టర్ బి.శరత్‌బోస్, డాక్టర్ కె.విజయ్‌కుమార్, జమ్మద్‌బాషా, రమణకుమార్, జీవీ, సీనియర్ సిటిజన్స్ నాయకులు జీవీ బ్రహ్మం, శ్రీహరిరావు, వెంకటేశ్వర్లు, విశ్రాంత అధ్యాపకులు సీహెచ్ వీవీ సత్యనారాయణ, జి.శాంతారాం, శర్మ, హేతువాద నాయకులు కరణం రవీంద్ర, రామమూర్తి, ఉపాధ్యాయులు గురజాల శ్రీనివాసరావు, అధ్యాపకులు మద్ది ప్రసన్నాంజనేయులు, వాసుదేవరావు, వెంకటేశ్వరరెడ్డి, పురప్రముఖులు ఎ.మల్లికార్జున, గంటా శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



బాపట్ల టౌన్ హాలులోని తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పిస్తున్న డాక్టర్ పీసీ సాయిబాబు తదితరులు

ఏపీసీపీడీసీఎల్ బిల్లు పేమెంట్ క్యూఆర్ కోడ్ కరపత్రాల ఆవిష్కరణ

బాపట్ల, జూలై 17 : బాపట్ల సూర్యలంక రోడ్డులోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఏపీసీపీడీసీఎల్ బిల్లు పేమెంట్ క్యూఆర్ కోడ్ కరపత్రాలను టౌన్ ఏఈ పెరుగు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌బిఐ మార్గదర్శకాలను అనుసరించి ఇక మీదట ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం ఇతర యూపీఐ యాప్స్‌లో వినియోగదారులు బిల్లులు చెల్లించుటకు ఏపీసీపీడీసీఎల్ డిస్కమ్ పేరు కనిపించదని తెలిపారు. వినియోగదారులు ఏపీసీపీడీసీఎల్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని డిస్కమ్ వెబ్‌సైట్‌లో నుంచి బిల్లులు చెల్లించవచ్చు అని తెలిపారు. డిస్కామ్ వెబ్‌సైట్‌లోగాని వినియోగదారులు బిల్లులు చెల్లించినప్పుడు ఫోన్‌పే, జీపే, పేటీఎం యాప్స్‌ను వాడవచ్చునని, అలాగే డెబిట్, క్రెడిట్, నెట్‌బ్యాంకింగ్, క్యాష్‌కార్డ్స్ కూడా వాడవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ బర్మాప్రసాద్, ఎన్.శ్రీనివాసరావు, లైన్‌మెన్‌లు డి.సుబ్బారావు, ఎ.రఘుబాబు, రమేష్‌బాబు, సుధాకర్‌చౌదరి, ఆర్.కృష్ణ, సాంబశివరావు, జె.డేవిడ్, వి.సురేష్‌బాబు, రత్నం తదితరులు పాల్గొన్నారు.



ఏపీసీపీడీసీఎల్ బిల్లు పేమెంట్ క్యూఆర్ కోడ్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బాపట్ల టౌన్ ఏఈ పెరుగు శ్రీనివాసరావు, సిబ్బంది

క్రియాశీలక సభ్యత్వాలు బాధ్యతగా చేపట్టాలి

● జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన

బాపట్ల, జూలై 17 : జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాలను పార్టీశ్రేణులు బాధ్యతగా చేపట్టాలని నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ పిలుపునిచ్చారు. స్థానిక జనసేన కార్యాలయంలో బుధవారం పార్టీశ్రేణులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో ఇన్సూరెన్స్ తీసుకొచ్చిన ఘనత జనసేన పార్టీకే దక్కుతుందన్నారు. డిప్యూటీ సీఎం కె.పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని మహాయజ్ఞంలా చేయాలన్నారు. ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు నాల్గవ విడత క్రియాశీలక సభ్యత్వం నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు విష్ణుమొలకల చంద్రమోహన్, జిడుగు విజయమాధురి, సంగీత ఏసోబు, ఆరమళ్ళ సుజిత, హుస్సేన్‌బేగ్, షేక్.కరీముల్లా, షేక్.మున్నా, సయ్యద్ అన్సారీ, మోహనరావు, సురేష్ పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

కొల్లూరు, జూలై 17 : మండల పరిధిలోని దోనేపూడి పాల సొసైటీలో ఉన్న 98 మంది పాల ఉత్పత్తిదారులకు రూ.100కి రూ.6లు బోనస్‌గా అందించారు. మొత్తం రూ.3,01,609లు బోనస్‌గా పంపిణీ చేశారు. పాల ఉత్పత్తిదారుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా సంగం డెయిరీ పని చేస్తుందని జిఎల్‌జి భగవాన్ అన్నారు. పశు పోషణ నిమిత్తం మినరల్ మిశ్చర్ ప్యాకెట్లను ఉత్పత్తిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ఏరియా మేనేజర్ గోపికృష్ణ, ఫీల్డ్ కోఆర్డినేటర్ నవీన్, ఫీల్డ్ సూపర్‌వైజరు గోపి, కార్యదర్శి సుబ్బారావు పాల్గొన్నారు.

దళిత కాలనీలో పారిశుధ్యం మెరుగుపర్చాలి

బాపట్ల, జూలై 17 : పట్టణంలో దళితులు నివాసం ఉంటున్న కాలనీలలో పారిశుధ్యం అధ్వానంగా మారిందని, దీనిని మెరుగుపర్చే విధంగా చర్యలు తీసుకోవాలని అంటరానితన నిర్మూలన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక దళిత సంఘాల నాయకులతో కలిసి బుధవారం కమిషనర్ వి.నిర్మల్‌కుమార్‌ను కోరారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయనను తొలుత సత్కరించి సన్మానించారు. అనంతరం పట్టణంలోని దళితవాడల సమస్యలు గురించి వివరించారు. సమస్యలను పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు శీలం రోజన్‌బాబు, తగరపు రవికుమార్, మంచాల ఆనంద్ ఉన్నారు.

ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు

రేపల్లె, జూలై 17 : తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలో రైతన్నలు పొలాల్లో పూజలు నిర్వహించారు. ఈ ఏడాది ఖరీఫ్ పంట సక్రమంగా సాగి పంట దిగుబడి అధికంగా వచ్చే విధంగా చూడాలంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి గుడిలో తొలిఏకాదశి సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఏడాది ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, అందరి ఇంట సిరులు కురిపించాలని అర్చకులు స్వామిని వేడుకున్నారు.

● బాపట్ల, జూలై 17 : పట్టణంలోని పలు దేవాలయాలలో బుధవారం తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు ఆలయాలకు వచ్చి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఎస్ఎన్‌పి అగ్రహారంలో ఉన్న శ్రీప్రసన్నాదుర్గాభవానీమాత దేవాలయంలో మహిళలు పెద్దఎత్తున పూజలు నిర్వహించారు. అదేవిధంగా భీమావారిపాలెంలో విశ్వహిందుపరిషత్ పట్టణ కార్యదర్శి బండ్రెడ్డి రజనీ తొలిఏకాదశి కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు వాటర్‌బాటిల్స్ పంపిణీ చేశారు.



ఎస్ఎన్‌పి అగ్రహారంలో శ్రీప్రసన్న దుర్గాభవానీమాత దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

బాపట్ల పట్టణం చీలురోడ్డులో ఉన్న శ్రీరుక్మిణి సమేత పాండురంగస్వామి దేవాలయంలో తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం ఉదయం స్వామివారికి విశేష పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామివారిని గరుడ వాహనంపై బాపట్ల పుర వీధులలో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ అర్చకులు రొంపిచర్ల కేశవాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు.

● కర్లపాలెం, జూలై 17 : మండలంలోని పలుదేవాలయాలలో బుధవారం ఏకాదశి పర్వదిన వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాలలో ఉన్న దేవాలయాలలో పురోహితులు విశేష పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. శ్రీ జనార్దనస్వామి దేవాలయంలో క్షత్రియ భక్తులు శ్రీ జనార్దనస్వామి వారికి విష్ణుసహస్రనామపారాయణం చేశారు. పురోహితులు బృందావనం శ్రీనివాసచార్యులు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. పేలాల పిండిని ఏర్పాటు చేసి ప్రసాదంగా పంపిణీ చేశారు.

● చుండూరు, జూలై 17 : తొలి ఏకాదశిని మండలంలోని అన్ని వైష్ణవాలయాల్లో సంప్రదాయ బద్ధంగా బుధవారం ఉత్సవాలు నిర్వహించారు. యడ్లపల్లిలో శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీలక్ష్మీ నరసింహాస్వామి, మోదుకూరులోని చెన్నకేశవస్వామి, వేంకటేశ్వరస్వామి, నడిగడ్డపాలెంలోని శ్రీ చిన్నజీయర్ స్వామి ఆశ్రమంలో, మండూరు, ఆలపాడు, చుండూరు, వలివేరులోని వైష్ణవ ఆలయాల్లో జరిగిన పూజాది కార్యక్రమాల్లో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు నామ సంకీర్తనలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు.

● భట్టిప్రోలు, జూలై 17 : తొలి ఏకాదశి పండుగను మండలంలో బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండలంలోని సూరేపల్లి పంచాయతి వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ రుక్మాబాయి సమేత పాండురంగస్వామి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా జరిపించారు. అదేవిధంగా స్థానిక సాధన మండలి బ్రహ్మవిద్యాశ్రమంలో ఉన్న శ్రీ కృష్ణపరమాత్మకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కర్పూరయజ్ఞం జరిపించారు. ఆశ్రమ అధ్యక్షురాలు బూర్లె అరుణకుమారి, కోట యశోదదేవి, మానేపల్లి హృదయలక్ష్మి, కోట సంధ్యారాణి, పులికొండ దేవసేన ఆండాళ్, పులికొండ సీతారత్నం, బండి వెంకట్రావు, చెన్నా పాపారావు, చుండూరు గోపాలకృష్ణమూర్తి, వంగర నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వెల్లటూరు గీతామందిరం భజన బృందాల ఆధ్వర్యంలో ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు హరేరామ హరే కృష్ణ నామపారాయణ గావించారు. గీతా మందిరం నిర్వాహకురాలు వేములపల్లి వనజాక్షి, సమరసత సేవా ఫౌండేషన్ రేపల్లె ఖండ కన్వీనర్ క్రాప రవికుమార్, వంగర చలమయ్య సిద్ధాంతి, భక్తులు పాల్గొన్నారు.



వేమవరంలో శ్రీ రుక్మాభాయి సమేత పాండురంగ స్వామి

● వేమూరు, జూలై 17 : తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం మండల పరిధి గ్రామాల్లోని వైష్ణవ ఆలయాలలో వార్షిక ఉత్సవాలను నిర్వహించారు. జంపని శ్రీ చెన్నకేశవ ఆలయంలో గౌడ కులస్తులు వార్షిక ఉత్సవంలో భాగంగా స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి పుష్పమాలికలతో విశేషాలంకరణ జరిపారు. ఆగమశాస్త్ర ప్రకారం అర్చకులు విష్ణు అష్టోత్తర సహస్రనామాలతో పూజ జరిపారు. దాస సాహిత్య ప్రాజెక్టు భజన సమాజం వారు విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం చేశారు. పెరవలి కేశవ మాధవ స్వామి వేమూరు, వేణుకేశవస్వామి, చావలి వేణుగోపాలస్వామి, చదలవాడ చెన్నకేశవ స్వామి, అబ్బనగూడవల్లి కోదండ రామస్వామి ఆలయాలలో వార్షిక పూజాకర్తలు విశేష పూజలు జరిపించగా సాయంత్రం ఉత్సవమూర్తులతో ఆలయ ఉత్సవాన్ని జరిపారు. భజన సమాజం వారు హరినామ సంకీర్తన నిర్వహించారు. పేలపిండి ప్రసాదాన్ని భక్తులకు అందించారు.



విశేష అలంకరణలో జంపని చెన్నకేశవ స్వామి

శాకాంబరి అమ్మవారిగా దర్శనమిచ్చిన శ్రీ పెద్దింటమ్మతల్లి

కర్లపాలెం,జూలై 17 : కర్లపాలెంలోని శ్రీపెద్దింటమ్మ అమ్మవారు బుధవారం భక్తులకు శాకాంబరి అమ్మవారిగా దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు, భక్తులు శ్రీపెద్దింటమ్మఅమ్మవారిని పలురకాల కూరగాయలు, పండ్లతో శాకాంబరి అమ్మవారిగా విశేష అలంకరణ చేశారు. అమ్మవారికి సారెను సమర్పించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్, ఆర్యవైశ్య, క్షత్రియ మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



శ్రీ పెద్దింటమ్మ తల్లి

● మండలంలోని చింతాయపాలెం గ్రామసర్పంచ్ పీటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గౌడపాలేనికి చెందిన మహిళలు పెద్ద ఎత్తున కర్లపాలెంలోని శ్రీపెద్దింటమ్మ అమ్మవారికి బుధవారం సారె సమర్పించారు. తొలుత ఆలయానికి విచ్చేసిన మహిళలు, సర్పంచ్ శ్రీనివాసరావు శ్రీపెద్దింటమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

మట్టి ఖర్చులకు ఆర్థికసాయం

కర్లపాలెం, జూలై 17 : పేరలి పంచాయతీ పడమర యాదవపాలేనికి చెందిన దబ్బుకూటి బుల్లియ్య మరణించగా మట్టిఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు పేరలి నరసయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ పేరలి బాలకృష్ణమూర్తి సహకారంతో బుధవారం రూ.5 వేల నగదును కోఆర్డినేటర్ శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాగిత విజయరాజు, దేవరంపాటి రాజా, వడ్లమూడి మల్లికార్జున, మద్దిబోయన బుల్లియ్య, కోనయ్య, గవిని శ్రీనివాసరావు, బాబావలి, షేక్ సుభానీ, జోగి పసి, మౌలాలి, సుభానీ, చంద్రం, పమిడి తిరుపతయ్య పాల్గొన్నారు.

గుండెపోటుతో ఏపీ అసెంబ్లీ మార్షల్ ఉద్యోగి మృతి

పిట్టలవానిపాలెం, జూలై 17 : పిట్టలవానిపాలెం మండలం అల్లూ రు గ్రామపంచాయతీ పరిధిలోని నత్తలవారిపాలెం గ్రామానికి చెందిన కూచిపూడి లూదియరావు (39) గుండెపోటుతో మృతి చెందారు. లూదియరావు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ మార్షల్‌లో విధులు నిర్వహిస్తుండగా ఆకస్మికంగా గుండెపోటురాగా మంగళగిరిలో ఎన్ఆర్ఐ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. లూదియరావుకు భార్య మేస్సీ గ్రేస్, ఇద్దరు కుమారులు సంతానంగా ఉన్నారు. లూదియారావు మృతికి ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఫోను ద్వారా సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు ప్రభుత్వపరంగా అండగా ఉంటానని తెలిపారు.



లూదియరావు (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కర్లపాలెం, జూలై 17 : మండలంలోని పేరలి పంచాయతీ పడమర యాదవపాలేనికి చెందిన దబ్బుకూటి నాగయ్య (41) ఈనెల 15న చీరాలలో కూలీ పనులకు వెళ్ళి వస్తూ ఈపూరుపాలెం వద్ద బైక్ అదుపు తప్పి కిందపడి తీవ్రగాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం నాగయ్యను గుంటూరు ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ 16వ తేదీ రాత్రి నాగయ్య మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం నాగయ్య భౌతికకాయాన్ని స్వగ్రామమైన పేరలికి బుధవారం సాయంత్రం తీసుకొచ్చారు.



నాగయ్య (ఫైల్)

ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

భట్టిప్రోలు, జూలై 17 : ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని వెల్లటూరు వద్ద బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం కొల్లూరు మండలం తురకపాలెం గ్రామానికి చెందిన వాగోలు కోటేశ్వరరావు, పాములు ఇద్దరూ వ్యవసాయ పనుల నిమిత్తం భట్టిప్రోలు మండలం వెల్లటూరు వచ్చారు. పని ముగించుకుని తిరిగి తురకపాలెం వెళ్తుండగా వెల్లటూరు శివారులో బైక్ అదుపుతప్పి పక్కనే ఉన్న ముళ్ళపొదల్లోకి దూసుకుపోయింది. బైక్ నడుపుతున్న వాగోలు కోటేశ్వరరావు ముఖానికి మోదు పొడుచుకోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న పాములుకు స్వల్ప గాయాలయ్యాయి. కోటేశ్వరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.



కోటేశ్వరరావు మృతదేహం

యువత ఏకలవ్య ఆశయాలతో ముందుకు వెళ్ళాలి

రేపల్లె, జూలై 17 : పోరాటయోధుడైన ఏకలవ్యుడుని యువత ఆదర్శంగా తీసుకుని ముందుకువెళ్ళాలని బాపట్ల పార్లమెంట్ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మద్దుల అంకాలు అన్నారు. 5వ వార్డులోని ఏకలవ్యుని విగ్రహానికి బుధవారం పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువుని మించిన శిషుడిగా ఏకలవ్యుడు పేరొందారన్నారు. ఈ కార్యక్రమంలో మద్దుల కనకదుర్గారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొట్టు బసవకోటేశ్వరరావు, సజ్జా రమేష్, నాగరాజు, శేలం కల్యాణ్, సజ్జా రామాంజనేయులు, మద్దుల పార్వతి, పి.లంకేశ్వరరావు, బి.వెంకటేశ్వరరావు, నాంచారయ్య, సుబ్రహ్మణ్యం, ఉమామహేశ్వరావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

● బాపట్ల, జూలై 17 : బాపట్ల మండలం స్టూవర్టుపురం గ్రామంలోని ఏకలవ్యుని విగ్రహానికి బాపట్ల నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ అధ్యక్షుడు దేవరకొండ రాము పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి ఏకలవ్యుని జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎరుకుల కులస్థులకి నిధులతో కూడిన కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు చుక్కా పౌలు, మోటా రామారావు, రఘు, ఉయ్యాల శివ, జె.నాగరాజు, ఎంపీపీ చినపోతుల హరిబాబు పాల్గొన్నారు.

ఐజీని కలిసిన ఎస్పీ

బాపట్ల, జూలై 17 : గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని ఎస్పీ తుషార్‌డూడి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆయన ఐజీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



ఐజీ త్రిపాఠికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ

ఆర్యవైశ్యులపై అనుచిత వ్యాఖ్యలు తగదు

భట్టిప్రోలు, జూలై 17 : వైసీపీ నుంచి వేమూరు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన వరికూటి అశోక్‌బాబు ఆర్యవైశ్యులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆర్యవైశ్య సంఘాలు తీవ్రంగా ఖండించాయి. అశోక్‌బాబు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ స్థానిక వాసవీ అమ్మవారి దేవస్థానంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. గత 40 సంవత్సరాలుగా గ్రామంలోనే కాకుండా జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా ఆర్యవైశ్యుల కోసం ఎన్నో కార్యక్రమాలు చేసిన సాయిబాబాను వ్యక్తిగతంగా మాట్లాడడం, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన అశోక్‌బాబు స్థాయిని మించి మాట్లాడుతున్నారని వారు విమర్శించారు. దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తున్న సాయిబాబాపై విమర్శలు మానుకోవాలని, అభివృద్ధిపై పోటీపడాలని, సాయిబాబా అవినీతి చేసి ఉంటే నిరూపించాలని ఆర్యవైశ్య సంఘాలు తెలియజేశాయి. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘాలు, వ్యాపార సంఘాలు, దేవస్థానాల కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘీయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె, జూలై 17 : మండలంలోని 11 కేవీ కారుమూరు ఫీడర్, 11 కేవీ నల్లూరుపాలెం ఫీడర్ లైన్ల మరమ్మతుల కారనంగా గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనున్నదని విద్యుత్ శాఖ డీఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. రేపల్లె మండలంలోని ఉప్పూడి, నల్లూరుపాలెం, శింగుపాలెం, విశ్వేశ్వరం, కారుమూరు, వేజళ్ళవారిలంక గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నదని తెలిపారు.

● భట్టిప్రోలు, జూలై 17 : మండలంలోని పెదపులివర్రు సబ్ స్టేషన్ పరిధిలోని పెసర్లంక ఫీడర్ పరిధిలో మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ ఏడుకొండలు తెలిపారు. పెసర్లంక, పెదలంక గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు.

● చుండూరు, జూలై 17 : చుండూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవి ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ అర్జునరావు తెలిపారు. మోదుకూరు, చుట్టు ప్రక్కల గ్రామాల్లోను, పొలాల్లోని విద్యుత్ మోటార్లకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు చెప్పారు.

బాధితులకు ఆర్థిక సాయం అందజేత

కర్లపాలెం, జూలై 17 : మండలంలోని పేరలిపాడులో కాగిత ఆనందరావుకు చెందిన గడ్డివాము దగ్ధమవ్వటంతో నష్టపోయిన కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి అందజేసిన నగదును ఎంపీపీ యారం వనజ, వైసీపీ మండల కన్వీనర్ ఏడుకొండలు బుధవారం బాధిత కుటుంబానికి అందజేశారు.

పట్టణ ప్రజలకు సమృద్ధిగా తాగునీరు అందిస్తాం

● అనగాని శివప్రసాద్

రేపల్లె, జూలై 17 : పట్టణ ప్రజలకు సమృద్ధిగా తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ తెలిపారు. అరవపల్లి మెయిన్ కెనాల్ నుంచి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు మోటార్ల ద్వారా నీటిని బుధవారం తరలిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో పూర్తి స్థాయిలో పట్టణవాసులకు నీరు అంతంతమాత్రాన ఉండటంతో ప్రజలు ఇబ్బంది దృష్ట్యా మంత్రి అనగాని సత్యప్రసాద్ జలవనరులశాఖాధికారులతో మాట్లాడి మెయిన్ కెనాల్‌కు నీటిని విడుదల చేయించారన్నారు. మెయిన్ కెనాల్ నుంచి అరవపల్లి వద్ద ఉన్న సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్‌కు మోటార్ల ద్వారా నీటిని తరలించి ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందించే దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.



అరవపల్లి సమ్మర్‌స్టోరేజ్‌ట్యాంక్‌కు మోటార్ల ద్వారా మెయిన్ కెనాల్ నుంచి పంపిణీ చేస్తున్న నీరు

పేదలకు మెరుగైన వైద్యం అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● నిజాంపట్నం జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య

రేపల్లె, జూలై 17 : పేదలకు మెరుగైన వైద్యం అందించే దిశగా మంత్రి అనగాని ప్రత్యేక దృష్టి సారించారని నిజాంపట్నం జడ్పీటీసీ, టీడీపీ సీనియర్ నాయకుడు నర్రా సుబ్బయ్య అన్నారు. నిజాంపట్నం ప్రభుత్వ వైద్యశాలను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వైద్యులను అడిగి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సమస్యలు, రోగులకు సరిపడా మందులు అత్యవసర చికిత్సకు కావాల్సిన పరికరాలు ఉన్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. లేని పరికరాలు, వైద్యసేవలకు ఏమైనా సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో మాట్లాడి సమస్య లు పరిష్కరించే విధంగా కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు బొమ్మిడి రామకృష్ణ, వైద్యులు డాక్టర్ శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.



నిజాంపట్నం ప్రభుత్వ వైద్యశాలను తనిఖీ చేస్తున్న జడ్పీటీసీ సుబ్బయ్య

సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

● జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మత్తి

రేపల్లె, జూలై 17 : కార్యకర్తలకు అండగా ఉండాలని పార్టీ బలోపేతానికికృషి చేసే విధంగా జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ క్రియాశీలక సభ్యత్వ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని, నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదులో విజయవంతం అయ్యేలా చూడాలని జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మత్తి భాస్కరరావు అన్నారు. రేపల్లె రూరల్ జనసేన పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం చేసే విధంగా బుధవారం సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభ్యత్వనమోదుతో పాటు ప్రతి కార్యకర్తకు రూ.5 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా కలిగి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్‌సెల్ సభ్యులు మెండు సుబ్బారావు, నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు రేపల్లె జానకిరామయ్య, దూళ్ళ సురేష్, మైలా నరేష్‌యాదవ్, గోపిరాజు ఉదయకృష్ణ, బత్తులమల్లి, ఆళ్ళ సూరిబాబు, పూషడపు నాని, యార్లగడ్డ చక్రవర్తి, జీ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మత్తి భాస్కరరావు

20న జరిగే ధర్నాను జయప్రదం చేయాలి

కొల్లూరు, జూలై 17 : ఉపాధి హామీ పథకం కూలీలు నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బొనిగల సుబ్బారావు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని జువ్వలపాలెం, కిష్కింద పాలెం, తిప్పలకట్ట, తోకలవానిపాలెం గ్రామాల్లో బుధవారం పర్యటించి కూలీలను కలుసుకుని వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరువు పనిగా పిలవబడే ఉపాధి హామీ పనులు ఎన్నికల ప్రారంభం నుంచి నిలిపి వేశారన్నారు. గతంలో చేసిన పనులకు ఏడు వారాలకు సంబంధించిన వేతనం కూలీలకు అందకపోవడంతో పలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కొత్తగా పనులు లేకుండా పోయాయని ప్రతి కూలీకి ఏడాదికి 200 రోజులు ఉపాధి పనులు కల్పించాలని, రూ.600 కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా అంశాలపై కూలీలంతా ఈ నెల 20న కొల్లూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన, ధర్నా కార్యక్రమాలను నిర్వహించనున్నారని ఉపాధి హామీ కూలీలందరూ ఐక్యతతో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో మొహరం పండుగ

వేమూరు, జూలై 17 : మండల పరిధి గ్రామాల్లోని ముస్లింలు బుధవారం మొహరం పండుగను భక్తి ప్రపత్తులతో జరుపుకున్నారు. గత మూడు రోజుల నుంచి పీర్ల చావిడలలో ఉన్న పీర్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు, పూజలు జరిపారు. గ్రామాల్లో ఊరేగించారు. పూజలు జరుపుతున్న కుటుంబాల వారు ఉపవాస దీక్షలో ఉండి పీర్లను చేతపట్టి నిప్పులపై నడిచారు. పండుగ సందర్భంగా ఇళ్లలో ప్రత్యేక ప్రార్థనలు చేసి పానకం పంచిపెట్టారు. ఒకరినొకరు మొహరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● కొల్లూరు, జూలై 17 : మొహరం పర్వదినాన్ని ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. బుధవారం మండల కేంద్రం కొల్లూరులో మొహరం పురస్కరించుకుని మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం పీర్లను శుభ్రపరిచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ముస్లింలతో పాటు హిందువులు పాల్గొని మతసామరస్యాన్ని చాటుకున్నారు.



కొల్లూరులో పీర్లను ఊరేగిస్తున్న ముస్లింలు

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి : మేకల

రేపల్లె, జూలై 17 : అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను జయప్రదం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి మేకల ప్రసాద్ అన్నారు. రేపల్లె పట్టణం 13వవార్డు గాంధీనగర్‌లో అఖిల భారత రైతుకూలీ సంఘం జనరల్ కౌన్సిల్ పోస్టర్లను బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగంపై శ్రద్ధకనబర్చకపోవటం వల్ల రైతులు ప్రతి వ్యవసాయ సీజనల్‌లో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వ్యవసాయ కూలీలకు గ్రామీణ ప్రాంతాల్లో కేవలం సంవత్సరంలో 150రోజులు పనిదినాలు మాత్రమే లభిస్తున్నాయన్నారు. దీనివలన ఉపాధికోసం కూలీలు వలస పోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, నాయకురాళ్ళు పాల్గొన్నారు.

బైక్‌తో ఢీకొట్టారంటూ ఫిర్యాదు

బాపట్ల, జూలై 17 : స్కూటీపై వెళుతున్న తనను బైక్‌పై వస్తున్న వ్యక్తులు ఢీకొట్టారంటూ మెకానిక్ షేక్ సుభానీ బుధవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 8వ తేదీన జరిగిన ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొంది డిశ్చార్జి అయిన తర్వాత వచ్చి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ యు.శ్రీనివాసులు తెలిపారు.

ఎన్నెస్పీ నీటి విడుదలపై హర్షం

ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, జూలై 17: గ్రామాలలో తాగునీటి ఎద్దడిని తీర్చేందుకు సాగర్ జలాలు విడుదల చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న చొరవ హర్షనీయని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. పల్నాడు, ప్రకాశం, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో తాగునీటి అవసరాలు తీర్చేందుకు ఎన్నెస్పీ కుడికాలువ ద్వారా బుధవారం నీటిని విడుదల చేయడం కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చొరవకు నిదర్శనం అన్నారు. ప్రజల అవసరాలు, ప్రజా ప్రతినిధుల విజ్ఞప్తుల పట్ల ప్రభుత్వ స్పందన ఎనలేనిదన్నారు. సాగర్ నీటి ద్వారా చెరువులను నింపేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాని ఏలూరి సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తాగునీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపాలన్నారు. ప్రణాళికాబద్ధంగా మేజర్లకు నీటిని పంపిణీ చేసేలా పర్యవేక్షించాలన్నారు. నీటి ఎద్దడి నివారణలో గత వైసీపీ పాలకులు ఘోరంగా విఫలమయ్యారని పేర్కొన్నారు.

దాతల సహకారం అభినందనీయం

పర్చూరు, జూలై 17 : హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని జనసేన నాయకులు ఆలా అనిల్ కుమార్ అన్నారు. పర్చూరులో గ్రామస్థులు, దాతల సహకారంతో రూపుదిద్దుకుంటున్న శ్మశాన వాటిక అభివృద్ధి పనులను బుధవారం ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అక్కడ మొక్కలు నాటారు. స్పెషల్ కలెక్టర్ కఠారి రమేష్ నాయుడు మాట్లాడుతూ గ్రామస్థులు కలసి కట్టుగా గ్రామాభివృద్ధికి చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో సురేంద్రబాబు, కోటేశ్వరరావు, నరసింహం, కోటా హరిప్రసాద్, కృష్ణంశెట్టి శ్రీనివాసరావు, ప్రసాద్, తులసి భువనేశ్వరరావు, తులసి భాస్కర్, ఒగ్గిశెట్టి గోవిందరాజులు, పేర్ని హరి పాల్గొన్నారు.

సాగర్ కాలువైతే మాకేంటి..!





జీఎన్‌టీ రోడ్డు బొల్లాపల్లి వద్ద సాగర్ కాలువ కట్టపై పోసిన గ్రానైట్ వ్యర్థాలు .. సాగర్ కాలువ అంచుపై పోసిన వేస్ట్

- యథేచ్ఛగా గ్రానైట్ వ్యర్థాల పారబోత
- పట్టించుకోని ఎన్నెస్పీ అధికారులు
- ఆందోళనలో రైతులు

మార్టూరు, జూలై 17 : కొంతమంది గ్రానైట్ పరిశ్రమల యజమానులు తమ గ్రానైట్ పరిశ్రమలోని గ్రానైట్ వ్యర్థాలను పొలాలు, డొంకల్లో రోడ్డు ప్రక్కన ఖాళీ ప్రదేశాల్లో పడేస్తున్నారు. వ్యర్థాలను డంప్ చేసేందుకు అనువైన ప్రదేశం లేక ఇష్టానుసారంగా వారు పారేస్తున్నారు. వారిలో కొంతమంది ఏకంగా సాగర్ కాలువ కట్ట రోడ్డును, సాగర్ కాలువ అంచుల్లో వేస్తున్నారు. రాత్రి సమయాలలో ట్రాక్టర్లపై గ్రానైట్ వ్యర్థాలను తెచ్చి పడేస్తున్నారు. జాతీయ రహదారి పక్కన మార్టూరు మండల పరిధిలో కోనంకి ఎన్‌ఎస్‌పీ జీఎన్‌టీ బొల్లాపల్లి రోడ్డు వద్ద సాగర్ కాలువ ప్రక్కన వ్యర్థాలను డంప్ చేశారు. బొల్లాపల్లి బ్రిడ్జికి తూర్పువైపున కాలువకు ఎడమవైపు, కాలువ అంచున పెద్దఎత్తున వ్యర్థాలను పారబోశారు. దీంతో కాలువ కట్ట నుంచి దిగువకు వెళ్లే సిబ్బంది, కాలువ పక్కనే ఉన్న పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బంది పడుతున్నారు. వ్యర్థాల కారణంగా మట్టిరోడ్డు ఇరుకుగా తయారవుతుందని, కట్టపై రైతుల ట్రాక్టర్లు, బైకులు వెళ్లేందుకు సైతం ఇబ్బందులు తలెత్తుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద ఎత్తున వ్యర్థాలను డంప్ చేస్తే కాలువలో నీరు వచ్చినపుడు మానిటరింగ్ చేసే ఎన్‌ఎస్‌పీ సిబ్బందికి, కట్టపై వెళ్లేవారికి ఇబ్బందులు తప్పవని అంటున్నారు.

పట్టించుకోని అధికారులు

కోనంకి గ్రామంలో ఎన్నెస్పీ కార్యాలయం ఉంది. ప్రస్తుతం జీఎన్‌టీ బొల్లాపల్లి వద్ద సాగర్ కాలువ పక్కనే గ్రానైట్ వ్యర్థాలను డంపింగ్ చేశారు. వీటి మధ్య 3 కి.మీ. దూరం అంటే కూతవేటే కానీ గుర్తుతెలియని వ్యక్తులు దర్జాగా గ్రానైట్ వ్యర్థాలను సాగర్ కాలువ కట్టపై పారబోశారు. ఈ విషయమై ఎన్నెస్పీ సిబ్బంది అడ్డుకోలేదు. కనీసం అధికారులు కూడా ఈ విషయాన్ని పట్టించుకోలేదు. ప్రజలకు తాగునీరు అందించే, పొలాలకు నీరు అందించే సాగర్ కాలువ ప్రక్కన ఇలా గ్రానైట్ వ్యర్థాలను వేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

మంత్రి గొట్టిపాటి

సంమాగులూరు, జూలై 17 : రాష్ట్రంలో రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మండలంలోని పట్టావారిపాలెం అడ్డరోడ్డులోని అతిథి గృహంలో బుధవారం పలు గ్రామాల రైతులతో మంత్రి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతమాగులూరు మండలంలోని అన్ని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయా సమస్యలపై అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

మంత్రి కార్యక్రమానికి అధికారులు డుమ్మా

మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరవుతున్నట్లు మంగళవారం తహసీల్దార్, ఎంపీడీవోలకు మంత్రి కార్యాలయం నుంచి సమాచారం ఇచ్చినా ఈ సమీక్షకు తహసీల్దార్, ఎంపీడీవో డుమ్మా కొట్టారు. దీంతో మంత్రి గొట్టిపాటి అసహనానికి గురయ్యారు. గ్రామాబివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు సహకరించాలని, పద్ధతి మార్చుకోవాలని సూచించారు.

మహాలక్ష్మి ఆలయానికి మైక్‌సెట్ బహూకరణ



మైక్‌సెట్‌ను అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, జూలై 17: రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో బుధవారం దాతల సహకారంతో పట్టణంలోని అమ్మవారి దేవాలయానికి మైక్‌సెట్, కుర్చీలను అందజేశారు. ఈ క్రమంలో చుండూరి రామారావు, వెంకట సుశీల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ అధ్యక్షుడు చుండూరి మురళి సుధాకరరావు సౌజన్యంతో అద్దంకిలోని కొత్తపేటలోని శ్రీ మహాలక్ష్మీ తల్లి అమ్మవారి ఆలయానికి మైక్‌సెట్, నాలుగు కుర్చీలను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, ట్రెజరల్ మలాది శ్రీనివాసరావు, ఏజి షేక్ మహమ్మద్‌రఫీ, రామకోటేశ్వరరావు, నర్రా శ్రీలక్ష్మి, సందిరెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ దేవపాలన, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, ఆంజనేయులు, పూర్ణచంద్రరావు, సుబ్బారావు, రమేష్ పాల్గొన్నారు.

తీరంలో జాగ్రత్తగా స్నానాలు ఆచరించాలి



పర్యాటకులతో మాట్లాడుతున్న ఎస్ఐ శివకుమార్

వాడరేవు(చీరాలటౌన్), జూలై 17 : సముద్ర తీరానికి స్నానాలు ఆచరించేందుకు వచ్చిన పర్యాటకులు జాగ్రత్తలు తీసుకోవాలని ఈపూరుపాలెం ఎస్ఐ శివకుమార్ అన్నారు. మొహర్రం సందర్భంగా బుధవారం సముద్రతీరానికి పర్యాటకులు పోటెత్తారు. ఈసందర్భంగా ఎస్సై వాడరేవు, రామాపురం సముద్రతీరంలో పర్యటించారు. పర్యాటకులకు జాగ్రత్తలు సూచించారు. గజ ఈతగాళ్లతో సుదీర్ఘంగా మాట్లాడారు. పర్యాటకులకు అందుబాటులో ఉండాలన్నారు. ఎస్సై వెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రాగి వైరు చోరీ

బల్లికురవ. జూలై 17 : కొత్తూరు గ్రామంలో నాలుగు రోజుల నుంచి పెద్ద ఎత్తున పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫా ర్మర్ల నుంచి రాగి వైరు, సోలార్ ప్లేట్లను దొంగలు చోరీ చేస్తు న్నారు. దీంతో రైతులు బెంబేలెత్తు తున్నారు. గ్రామానికి చెందిన పాపసాని చలమయ్య, చెక్కెర శ్రీనివాసరెడ్డి, మానావత్ హరినాయక్, మెలికా ఆదినారాయణకు చెందిన వ్యవసాయ మోటార్ల రాగి వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్ల వైర్లు, సోలార్ ప్యానల్ బాక్సులను దొంగిలించారు. వ్యవసాయ పంట సీజన్‌లో చోరీలు జరగడం చూసిన రైతులు లబోదిబో మంటున్నారు. చోరీలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని రైతులు తెలిపారు. మరికొందరి వైర్లు చోరీలు జరిగాయని వారు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

చీరాలటౌన్, జూలై 17 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి గుంటూరులో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందారు. వివరాల్లోకి వెళితే బాపట్ల జిల్లా కర్లపాలెం మండల పరిధిలోని పేర్లి గ్రామానికి చెందిన దబ్బకూటి నాగయ్య(40) చీరాల మండలం ఈపూరుపాలెంలోని ఓ శనగకాయల మిల్లులో పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య దేవి, కుమారుడు సంతానం. ఇదిలా ఉండగా ఎప్పటిలాగే పనికి వచ్చి సాయంత్రం సమయంలో సహచరుడు మురళీకృష్ణ బండిపై టిఫిన్ చేసేందుకు ఈపూరుపాలెం సెంటర్‌కు వెళ్లి తిరిగి మిల్లు దగ్గరకు వెళ్లేందుకు బయలు దేరారు. ఈనేపథ్యంలో బాయ్స్ హైస్కూల్ సమీపానికి రాగానే గుంతలలో వాహనం అదుపు తప్పింది. దీంతో వెనుక కూర్చున్న నాగయ్య ఒక్కసారిగా కింద పడి గాయడ్డారు. గుంటూరులో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈమేరకు ఈపూరుపాలెం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు.

దుకాణంలో చోరీపై కేసు

చీరాలటౌన్, జూలై 17 : చీరాల పట్టణం బెస్తపాలెంలో జరిగిన చోరీపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. పిసిని నాని బెస్తపాలెంలో కూల్‌డ్రింక్ షాపు నడుపుకుంటున్నాడు. ఈక్రమంలో గుర్తు తెలియని వ్యక్తిగత ఆదివారం అటుగా వెళుతూ దుకాణంలోని రూ.40వేలు అపహరించి పరారయ్యాడు. దీంతో యజమాని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే ఇప్పటికే సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించినట్లు సమాచారం.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

విజయనగర్‌కాలనీ(చీరాలటౌన్), జూలై 17 : కారంచేడు అమరవీరుల త్యాగాలు మరువలేనివని వక్తలు అన్నారు. బుధవారం చీరాల మండల పరిధిలోని విజయనగర్ కాలనీలోని రుధిర క్షేత్రం వద్ద అమరవీరుల 39వ వర్ధంతిని నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ప్రతినిధులు ముందుగా అమర వీరుల చిత్రపటాలకు నివాళులర్పించారు. విజయాలు సాధించాలంటే త్యాగాలు తప్పవని వక్తలు అన్నారు. గద్దర్ గీతాలను ఆలపించి ఉత్సాహపరిచారు. సంబంధిత కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాస్కరరావు, తేళ్ల వెంకటస్వామి, సుందరరావు, బాబూరావు, కృపాకర్, బాబూరావు, మాణిక్యరావు, భగత్‌సింగ్, లక్ష్మీనరసయ్య, రవి, చిట్టిబాబు, గంగయ్య పాల్గొన్నారు.

దర్గా కొండపై మృతదేహం

కంభం, జూలై 17 : కంభం మండలం కందులాపురం పంచాయతీ పరిధిలోని మస్తాన్‌స్వామి దర్గా కొండపై బుధవారం కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహం కలకలం సృష్టించింది. మృతుడు బాపట్ల జిల్లా మార్టూరుకు చెందిన సురేష్ (30)గా గుర్తించారు. సురేష్ కంభం రైల్వేస్టేషన్‌లో గ్యాంగ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నెల రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వచ్చిన సురేష్ కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకీ కోసం గాలిస్తుండగా బుధవారం దర్గా కొండపై కుళ్లిన స్థితిలో ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సురేష్‌కు నెల కిందట వివాహం అయింది.



రైతు ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

నీటి సంఘాల నియామకాలపై కసరత్తు

రైతు ప్రతినిధులతో సమావేశమైన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూలై 17 : నియోజవకర్గ పరిధిలోని ఎత్తిపోతల పథకాలకు సంబంధించి ఆయా ప్రాంతాల్లోని గ్రామాల రైతు ప్రతినిధుల ఉంచి నీటి సంఘాల కమిటీల నియామకాలపై ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య కసరత్తు ప్రారంభించారు. అందులో భాగంగా బుధవారం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆయా గ్రామాల రైతు ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కొన్ని చోట్ల నీటి సంఘాలకు సంబంధించి తమనే నియమించాలని కొందరు పట్టుబట్టారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే కొండయ్య వేర్వేరుగా అభిప్రాయాలు సేకరించారు. అంతిమంగా వివాదాలు, స్పర్ధలకు తావులేకుండా నీటి సంఘాల నియామకాలు చేసుకుందామని, అవి భవిష్యత్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు అదనపు బలంగా ఉండాలనే కోణంలో నిర్ణయం తీసుకుందామని చెప్పినట్లు తెలిసింది. కార్యక్రమంలో పలు గ్రామాల రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

జనసేనలో సభ్యులుగా చేరండి

పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

పర్చూరు, జూలై 17 : జనసేన పార్టీలో సభ్యులుగా చేరి పార్టీ బలోపేతంలో భాగస్వాములు కావాలని ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపూడి విజయ్ కుమార్ కోరారు. బుధవారం రోటరీ భవనంలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదుపై అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విజయ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రగతి, ప్రజా సమస్యల పరిష్కారం కోసమే జనసేన పార్టీ ఆవిర్భవించిందన్నారు. పార్టీలో సభ్యునిగా చేరిన ప్రతి ఒక్కరికీ రూ.5లక్షల ప్రమాద జీవిత బీమాను అధినేత పవన్ కల్యాణ్ కల్పించడం జరిగిందన్నారు. కార్యకర్తలు, ప్రజలకు అండగా జనసేన పార్టీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకరశెట్టి చిరంజీవి, విజయ్‌కుమార్, గనిపిశెట్టి అయ్యప్ప, నారిశెట్టి ప్రవీణ్, సందు శ్రీనివాసరావు, మందపాటి కిషోర్, శ్రీనివాసరావు, స్థానిక నాయకులు కారంపూడి సందీప్‌తేజ, తులసి చంటి, కందా సురేంద్రబాబు, తోట మణి, సతీష్, బాలు, శీలం కుమార్, బోగాది మోహన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి

- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- ప్రత్యేక పూజలు




దత్తపాదుకా క్షేత్రంలో అమ్మవారు.. చందులూరులో రామలింగేశ్వరస్వామికి పూజలు

అద్దంకి, జులై 17 : తొలి ఏకాదశిని భక్తులు బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. అద్దంకి పట్టణంలోని దత్త పాదుకాక్షేత్రం, కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయం, మాధవస్వామి దేవాలయం, శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం, లక్ష్మీనరశింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దత్తపాదుకాక్షేత్రంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పంగులూరు, జూలై 17 : తొలి ఏకాదశి పూజలు బుధవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. పర్వదినం సందర్భంగా ఆలయాలలో స్వామివారికి అభిషేకాలు నిర్వహించి దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాలకు అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చందలూరు, ముప్పవరం, పంగులూరు పరిసర గ్రామాలలోని రామలింగేశ్వర స్వామి, భీమలింగేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

బల్లికురవ : తొలి ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. మండలంలోని కొణిదెన చెన్నకేశవ స్వామి వారి దేవాలయంలో ముక్తేశ్వరం గ్రామంలోని ముక్తిలింగేశ్వరస్వామి దేవాలయంలో పండగ వేడుకలు వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై పూజలలో పాల్గొన్నారు. కొందరు ప్రజలు కోటప్పకొండ పుణ్యక్షేత్రానికి తరలి వెళ్లారు.

రామకూరు కొండపై ఆధ్యాత్మిక శోభ

రామకూరు గ్రామ కొండపై కొలువుదీరిన శ్రీ రామలింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు తరలి రావడంతో కొండపై ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. రామకూరు పరిసర ప్రాంత ప్రజలు కొండపై కొలువుదీరిన రామలింగేశ్వరునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటలకు గిరి ప్రదక్షిణ, మెట్లపూజ అనంతరం స్వామివారికి పంచామృత అభిషేకములు, అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు పొంగలి, పులిహోర, లడ్డు ప్రసాదాలతో పాటు మజ్జిగ అందచేశారు. బొప్పూడి వీరాంజనేయులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చీరాలటౌన్ : తొలి ఏకాదశిని సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పేరాల ముత్యాలమ్మ చెట్టు వద్ద భక్తులు అమ్మవారిని బంగారు ఆభరణాలతో అలంకరించారు. కూరగాయలతో ప్రత్యేక దండను వేసి, మొక్కులు తీర్చుకున్నారు.

రైల్వే అండర్‌పాస్‌తో వెల్లలచెరువు ప్రజలకు ఇబ్బందులు

- దాని నిర్మాణంతో మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం
- మంత్రి గొట్టిపాటి దృష్టికి సమస్యను తీసుకెళ్లిన గ్రామస్థులు




వెల్లలచెరువు వద్ద రైల్వే అండర్‌పాస్‌లో నిలిచిన మురుగు

వెల్లలచెరువు(అద్దంకి), జూలై 17 : అద్దంకి నియోజకవర్గంలో ఉన్న ఏకైక రైల్వే స్టేషన్ సంతమాగులూరు మండలంలోని వెల్లలచెరువులో ఉంది. రైల్వే అండర్‌పాస్‌తో ఆ గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే అండర్ పాస్ లేని సమయంలో రైల్వే గేట్‌తో గ్రామస్థులు అవస్థలు పడ్డారు. గత ఏడాది అండర్‌పాస్ నిర్మాణంతో ఆ సమస్యకు పరిష్కారం లభించినట్లయింది. ఇప్పుడు మరో సమస్య వచ్చింది. కొండ నాలుకకు మందు వేస్తే అసలు నాలుకకే మోసం వచ్చినట్లు మారింది. అండర్ పాస్ నిర్మాణంతో గ్రామం నుంచి వాగుకు చేరే మురుగు మొత్తం అండర్‌పాస్‌కు చేరుతుంది. అండర్‌పాస్ ఎక్కువ లోతులో ఉండడం, వాగు ఎత్తులో ఉండడంతో మురుగు నీరు అండర్‌పాస్‌లో నిలిచి పోతుంది. వేసవిలో సైతం అండర్‌పాస్‌లో మురుగు నీరు నిలిచే ఉంటుంది. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో సమస్య మరింత తీవ్రమైంది. మురుగు నీటి దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.

ఈ సమస్యను పరిష్కరించాలని బుధవారం మంత్రి రవికుమార్‌కు గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

ఘనంగా మొహర్రం

హాజరైన మంత్రి రవికుమార్



చినగంజాంలో పీర్లను ఊరేగిస్తున్న ముస్లింలు

అద్దంకి, జూలై 17 : మొహర్రం పండుగను ముస్లింలు బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పీరులను గ్రామాలలో ఊరేగింపు నిర్వహించారు. పీరుల వద్ద పూజలు నిర్వహించారు. మండలంలోని మణికేశ్వరంలో మొహర్రం వేడుకలకు బుధవారం మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరై పీరుల వద్ద పూజలు నిర్వహించారు. మంత్రి రవికుమార్‌ను ముస్లిం పెద్దలు సత్కరించారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను గొట్టిపాటి దృష్టికి తీసుకువచ్చారు. పునరావాస కాలనీలో అన్ని వసతులు కల్పించాలని, ఇంకా ఇళ్ల స్థలాలు మంజూరు కాని కుటుంబాలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయించాలని కోరారు. టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, కరిముల్లా, బడావలి, మీరావలి, అంజయ్య, బ్రహ్మానందం, జ్యోతి రామారావు పాల్గొన్నారు.

చినగంజాం : మండలంలోని ముస్లింలు మొహర్రంను ఘనంగా నిర్వహించుకున్నారు. మత సామరస్యానికి ప్రతీగా పీర్ల పండుగను జరిపారు. చినగంజాం, కడవకుదురు గ్రామాల్లోని పీర్ల చావిడిలో పీర్లను పలు రకాల పూలతో విశేషంగా అలంకరించి గ్రామాల్లోని ప్రధాన వీధులలో ఊరేగింపు నిర్వహించారు. చినగంజాం, కడవకుదురు గ్రామాల్లోని పుర వీధులలో కనకతప్పెట్లు, మేళతాళాలతో యువకులు నృత్యాలు చేస్తూ ఊరేగింపు కార్యాక్రమాన్ని జరిపారు. పీర్ల చావిడి వద్ద అగ్నిగుండం ఏర్పాటు చేసి నిప్పులో నడిచి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అల్లాకు దూప, నైవేద్యాన్ని సమర్పించి బెల్లం పానకాన్ని భక్తులకు పంపిణీ చేశారు. మసీదులను, పీర్ల చావిడిలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

మార్టూరు : మండలంలో ముస్లిం మైనారిటీలు బుధవారం మొహర్రంను భక్తితో నిర్వహించారు. మంగళవారం రాత్రి మతపెద్దలు పీర్లచావిడి నుంచి పంజెలను బయటకు తీసి వాటిని యువకులు చేతబూని జండాలుగా ఊరేగింపుచేశారు. తొలుత ముస్లిం వీధుల నుంచి తర్వాత కోరేగుంతలు, గన్నవరం రోడ్డు తదితర వీధులలో ఊరేగింపు చేశారు. దీనివల్ల గ్రామంలోకి దుష్టశక్తులు ప్రవేశించవని, ప్రజలు ఆరోగ్యంతో ఉంటారని మత పెద్దలు తెలిపారు. అనంతరం పంజెలను వాగు వద్దకు తీసుకువెళ్లి వాటిని ఫాతిహా చేశారు. అనంతరం వాటిని పీర్లచావిడికి చేర్చారు. సాయంత్రం కొంతమంది పీర్లచావిడి వద్దకు వెళ్లి మొక్కులను తీర్చుకున్నారు.

వృద్ధులకు ఆహార ప్యాకెట్ల పంపిణీ

పర్చూరు, జూలై 17 : మొహర్రం సందర్భంగా పర్చూరులోని అత్తహార్ మసీద్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మసీద్ ప్రెసిడెంట్ అహ్మద్ బాషా మాట్లాడుతూ వృద్ధులను ఆదుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇమాం అఫ్జల్ హక్, మౌజన్ బాజీ, షేక్ ఫజల్, బాషా, మాబులా, ఫక్రుద్దీన్ ఆలీ, అహ్మద్, బాబు పాల్గొన్నారు.